
ఆదివారం
5 మార్చి, 2023
వార్త
వనితా! వందనం

పాన్ ఇండియాగా 'ఏజెంట్' విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని అఖిల్ హీరోగా స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ఏజెంట్'. ఈ చిత్రంలో అఖిల్ మునుపెన్నడూ లేని విధంగా సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ చిత్రం నుండి విడుదలైన ప్రచార చిత్రాలకి ఇప్పటికే ప్రేక్షకులు, అభిమానుల నుండి సూపర్ రెస్పాన్స్ వస్తోంది.

ఈ చిత్రంలో అఖిల్ అక్కినేని సరసన సాక్షి వైద్య హీరోయిన్‌గా నటిస్తుండగా హిప్ హాప్ తమిజా సంగీతం అందిస్తున్నారు.

పాన్ ఇండియా మూవీగా రిలీజ్‌గా కానున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

తారాతీరం

పోలీస్ ఆఫీసర్ పాత్రలో భూమి పెడ్నేకర్?

తెలుగు సినిమా పాన్ ఇండియా స్థాయికి చేరుకోవడంతో ఇక్కడి సినిమాల్లో చేయడానికి బాలీవుడ్ భామలు పోటీ పడుతున్నారు. అలియా భట్, కియారా అద్వాని, అనన్య పాండే వంటివారు ఇదివరకే తెలుగు సినిమాలు చేయగా, ఈ నేపథ్యంలోనే తాజాగా భూమి పెడ్నేకర్ పేరు వినిపిస్తోంది

భూమి పెడ్నేకర్‌కి బాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. 2015లోనే ఆమె బాలీవుడ్ తెరపైకి ఎంట్రీ ఇచ్చింది. అప్పటి నుంచి రొటీన్‌కి భిన్నంగా ఉండే పాత్రలను ఎంచుకుంటూ ముందుకు వెళుతోంది. తాజాగా మహేశ్‌బాబు సినిమా కోసం త్రివిక్రమ్ ఆమెను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మహేశ్‌బాబు 28వ సినిమాకి త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే ఈ సినిమా షూటింగు మొదలైంది. ఈ సినిమాలో మొదటి కథానాయికగా పూజ హెగ్డేను, రెండో నాయికగా శ్రీలీలను తీసుకున్నారు. మూడో నాయికగా భూమి పెడ్నేకర్‌ను ఎంచుకున్నారు. ఆమె పాత్ర సెకండాఫ్‌లో ఉంటుందనీ, పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని సమాచారం.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
5 మార్చి, 2023

మంచి ముత్యాలు

ఎలాంటి బాధా లేకుండా ఒకని ప్రవర్తనను
నియంత్రణ చేయడమే ఉత్తమ నైతికత.

- హెర్బర్ట్ స్పెన్సర్

విషయ విశేషం

పండ్ల ఆకారంలో బస్టాపులు... 4
'సంఘీ'భావం....5
ఐటీ కంపెనీల శ్రమదోపిడీ
కవర్ స్టోరీ..6
వనితా! వందనం
అహంకారం వీడితేనే..11
ఈవారం కవిత్వం..12
జ్ఞాపక పుష్పం
వేసవి ఎండలు మండిపోవచ్చు!...14
వలస పక్షులు.....18
కథ.. 20
మనసుంటే చాలు
సాహిత్యం...23
దిగంబర కవులు..
శిల్పకళా సంపదకు నిలయం 'హంపి' ...25
దృక్పథం....30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

తాజా వార్తలు

బెండకాయతో కాలుష్య నివారణ

సముద్రాలు, నదుల్లో చేరుతున్న మైక్రో ప్లాస్టిక్స్ పర్యావరణానికి ప్రమాదకరమన్నది తెలిసిందే. అందుకే వాటిని శుభ్రం చేసేందుకు రెండు రకాల పద్ధతుల్ని అవలంభిస్తున్నారు. నీళ్ల పైకి తేరుకున్న వాటిపై ఎప్పటి కప్పుడు తొలగించడం ఒక పద్ధతి. రెండో విధానంలో నీళ్లలో కొన్ని పదార్థాల (ఫ్లోక్యులెంట్ల)ను కలిపి అవన్నీ వాటికి అతుక్కునేలా చేస్తారు. ఆపైన అవన్నీ కలిసి నీళ్ల అడుగుకి చేరుకున్నాక వ్యర్థాల్ని తొలగిస్తారు. అయితే ప్లాస్టిక్‌ని తొలగించడానికి వాడే ఈ రసాయనాలు వాటితో చర్య పొందాక మరింత హానికరంగా పరిణమిస్తున్నాయి. అందుకే టెక్సాస్‌లోని టార్లెటన్ స్టేట్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ప్రత్యామ్నాయం కోసం మొక్కల నుంచి తీసిన పదార్థాలను వాడి చూశారట. అందులో మెంతులు, కాక్టస్, అలోవెరా, చింతపండు, బెండకాయ వంటి వాటిల్లోని పాలీశాకరైడ్లను వాడినప్పుడు అవన్నీ మైక్రోప్లాస్టిక్స్‌ని ఆకర్షించాయట. అయితే అన్నింటిలోకీ బెండకాయకి జిగురు ఎక్కువ కనుక ఇందులోని పాలీశాకరైడ్లు శక్తిమంతమైన ఫ్లోక్యులెంట్లలా పని చేసి, నీటిని శుభ్రం చేశాయట. దాంతో బెండ కాయల నుంచి ఆయా పదార్థాలను సేకరించడం ద్వారా సాగర, నదీజలాలను శుభ్రం చేయొచ్చని భావిస్తున్నారు.

సాగరంపై ఉండే సర్కస్ బృందం

నేల పైన సర్కస్ చేయడమే కష్టం.. అలాంటిది సముద్రంలోని తెరచాప పడవ పైన విన్యాసాలు ప్రదర్శించడం చాలా రిస్క్ అని చెప్పవచ్చు. కానీ యూరప్‌కి చెందిన సీక్లౌన్స్ సర్కస్ బృందం అదే చేస్తోంది. అందువల్లే ప్రపంచంలో ఏకైక సముద్ర సర్కస్ బృందంగా గుర్తింపు పొందింది. ఈ బృందం పగలంతా సముద్రం పైన ఉంటుంది. సాయంత్రాల్లో ఏదైనా ఒక రేవులో లంగరేసి తమ విన్యాసాలని ప్రదర్శిస్తుంది. దాన్ని చూడటానికి పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు వస్తారు. అయితే ఈ సర్కస్‌కి టికెట్టు ఉండదు. కార్యక్రమం పూర్తయ్యాక ప్రేక్షకుల ముందు టోపీలని చాచి వాళ్లు ఇచ్చినంత తీసుకుంటారు. "మీ పరిధిలో పర్యావరణాన్ని కాపాడుకోండి" అని సందేశాన్నిచ్చి సముద్రంలోకి వెళ్లిపోతారు ఈ బృంద సభ్యులు. పర్యావరణానికి ఏ హాని చేయవద్దని ఈ బృందం సభ్యులు సముద్రంలోనే జీవిస్తున్నారట. ఓడకి ఇంజిన్ పెడితే పర్యావరణానికి ముప్పు వస్తుందని సముద్రం పైన కేవలం గాలివాటుకే ప్రయాణిస్తుంది సీక్లౌన్స్ బృందం.

పండ్ల ఆకారంలో బస్టాపులు

ఆ దారిలో వెళ్లే ప్రయాణికులకు పుచ్చకాయ, నారింజ, టమాట, స్ట్రాబెర్రీ, కర్బూజ.. లాంటి వివిధ రకాల పండ్ల ఆకృతుల్లో ఉన్న బస్టాపులు కనువిందు చేస్తాయి. జపాన్‌లోని నాగసాకి నగరానికి సమీపంలో ఉన్న కొనగాయి అనే చిన్న పట్టణంలో కనిపిస్తుందీ దృశ్యం. 1990లో జరిగిన ట్రావెల్ ఎక్స్‌పో కోసం రూపొందించిన ఈ బస్టాపులు ఇప్పటికీ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. 207 నంబరు హైవేపై సుమారు పదహారు బస్టాపులను ఇలా వివిధ పండ్ల ఆకృతుల్లో నిర్మించారు. ప్రయాణికులను ఆకర్షించడం కోసం నిర్మించిన ఈ ఫ్రూట్ బస్టాపులు నిర్వహణ బాగుండటంతో పాతికేళ్లయినా ఇప్పటికీ సేవలు అందిస్తున్నాయి.

'సంఘీ' భావం

ఐటీ కంపెనీల శ్రమదోపిడీ

యువతకు ఉద్యోగ అవకాశాల్లో పెద్దపీట వేయడంతో పాటు ఉత్పత్తి, సేవారంగాల్లో తమకంటూ ఒక ప్రత్యేకతను కొనసాగిస్తున్న ఐటీ సంస్థలు క్రమంగా తమ వైఖరిని మార్చుకుంటున్నాయి. పెద్ద సంఖ్యలో యువతను ఉద్యోగాల్లో తీసుకున్న తరువాత కొన్ని అనివార్య కారణాలు అంటూ వారిని హఠాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. కరోనా సమయంలో వర్క్ ఫ్రం హోంతో తమ ఖర్చులను 60 శాతానికి పైగా తగ్గించుకున్నాయి. కరోనా సాకుతో జీతాలు కూడా గణనీయంగా తగ్గించివేశారు. గతంలో 50 వేలు దాటి ఇచ్చే జీతాలను ప్రస్తుతం 20 నుంచి 30 వేలకు తగ్గించారు. అయినా చాలామంది యువత ఐటీ సంస్థల్లో తగ్గిన వేతనాలతోనే ఉద్యోగాలకు చేరారు. కరోనా సమయంలో అన్ని వ్యవస్థలు కుప్పకూలగా వైద్యరంగంతో సమానంగా ఐటీ రంగం కూడా లాభాల బాటలో నడిచింది. ప్రధానంగా విదేశీ సంస్థలకు ఇచ్చే సర్వీసును పెంచి ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్నారు. అయినా ఉద్యోగుల పట్ల మాత్రం కఠిన వైఖరి అమలుచేస్తున్నారు. చాలా సంస్థలు ఉద్యోగులను క్యాబ్‌లలో కార్యాలయానికి రప్పించుకుని తిరిగి వారిని ఇంటి వద్ద దింపే వెసులుబాటు కల్పించారు. ఎందుకంటే 80 శాతం సంస్థలు నగరానికి దూరంగా ఉంటున్నాయి. రవాణా సౌకర్యం లేకపోవడంతో సిబ్బందికి ఈ వెసులుబాటు కల్పించారు. పనిచేసే ప్రాంగణంలో భోజనం, స్నాక్స్ వంటి అనేక సౌకర్యాలు కూడా కల్పించారు. దీనితో వేతనాలు తక్కువగా ఉన్నా చాలా మంది యువతీ యువకులు ఉద్యోగాల్లో చేరారు. అయితే కాలక్రమంలో ఒక్కొక్క సౌకర్యాన్ని తొలగిస్తూ వచ్చారు. ఉదయం వేళల్లో జనరల్ డ్యూటీల్లో పనిచేసే వారికి పూర్తిగా క్యాబ్ సౌకర్యాన్ని రద్దు చేశారు. సెకండ్ షిఫ్టులలో పనిచేసే వారికి కార్యాలయానికి వచ్చే క్యాబ్ సౌకర్యం రద్దు చేశారు. దీనితో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు మరికొన్ని సంస్థలు ఉద్దేశ్య పూర్వకంగా ఉద్యోగులను తొలగించడం ప్రారంభించారు. పలు సంస్థలు కార్మిక చట్టాలను ఉల్లంఘించి ఉద్యోగులను బయటకు పంపుతున్నారు. తమకు అవసరం లేదని చెప్పకుండా సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని కొందరిని, బదిలీలు చేసి వేధింపులకు గురిచేయడం, టీమ్ లీడర్లకు ఆదేశాలు ఇవ్వడం ద్వారా ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు తమ కింద పనిచేసే ఉద్యోగులను తొలగించకుంటే టీమ్ లీడర్లను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీనితో టీమ్ లీడర్ల నుంచి సిబ్బందికి వేధింపులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ కొన్ని సంస్థల్లో వర్క్ ఫ్రం హోం విధానం అమలులో ఉంది.

మరికొన్ని సంస్థలు హైబ్రీడ్ విధానం పేరుతో వారంలో రెండు మూడు రోజులు తప్పని సరిగా కార్యాలయానికి హాజరయ్యే విధానాన్ని అమలుచేస్తున్నారు. వర్క్‌ఫ్రం హోం సమయంలో పనిగంటలతో సంబంధం లేకుండా పనిచేయించుకుంటున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు కంప్యూటర్ ముందు కూర్చొంటే రాత్రి 8, 9 గంటల వరకు పని కొనసాగుతోంది. ఇంతా పనిచేసినా ఏ క్షణంలో ఉద్యోగం ఊడుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఒక ప్రముఖ సంస్థలో ఇంటర్వ్యూలు జరుగుతున్న సమయంలో హెచ్‌ఆర్‌లో చేసే ఉద్యోగిని తొలగిస్తున్నట్లు మెయిల్ వచ్చింది. దీనితో అతను షాక్‌కు గురయ్యాడు. అర్థాంతరంగా తనను తొలగించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశాడు. ఎప్పుడు వెళ్లిపోవాలని ఆదేశిస్తే ఆ క్షణంలో ఉద్యోగం వదిలి వెళ్లే విధంగా ఐటి సంస్థల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. మరో ప్రముఖ సంస్థ ఆరున్నర లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగులను నియమించింది. ఆరు నెలల పాటు పని చేసిన తరువాత తమకు అవసరానికి మించి ఉద్యోగులు ఉన్నారని, కొత్తగా చేరిన వారు సగం జీతానికి పనిచేయాల్సి ఉంటుందని, ఇష్టం లేకుంటే నెల రోజుల వ్యవధిలో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్లాలని మెయిల్స్ ఇచ్చింది. ప్రస్తుతం ఉద్యోగుల నియామకం అంతా ఆన్‌లైన్ విధానంలో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ వివరాలు ఇతర ఐటి సంస్థలు కూడా ఆన్‌లైన్‌లో చూసే అవకాశం ఉంటుంది. ఒక సంస్థ నుంచి వెళ్లిపోయిన తరువాత ఏ కారణాల వల్ల అతను వెళ్లిపోయాడు అన్న వివరాలు స్పష్టంగా ఉంటాయి. ఒకవేళ సదరు ఉద్యోగి విధుల నుంచి వెళ్లిపోవడానికి అంగీకరించకుండా యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే ఉద్యోగి ప్రవర్తన సరిగ్గా లేదని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీనితో ఏ కంపెనీకి వెళ్లినా ఈ అంశం అతనికి అడ్డంకిగా మారుతుంది. ఇతర సంస్థలు ఈ కారణాన్ని చూపించి అతనిని ఉద్యోగంలో తీసుకోవడానికి నిరాకరిస్తాయి. ఉద్దేశ్య పూర్వకంగా ఇలాంటి అపవాదు సదరు ఉద్యోగిపై మోపడంతో అతను ఇతర సంస్థల్లో చేరలేని పరిస్థితి ఉంటుంది. ఈ కారణం వల్ల ఉద్యోగులు ఐటి సంస్థల యాజమాన్యాల ఆదేశాలకు ఎదురు చెప్పకుండా బయటకు వెళ్లిపోతారు.

దీనితో అతను వేరే చోట ఉద్యోగంలో చేరేందుకు అవకాశాలు ఉంటాయి. ఐటి సంస్థల తీరును ప్రశ్నించేవారులేకపోవడంతో ప్రస్తుతం ఇక్కడ పనిచేసే ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ఒకప్పటి ఉద్యోగ భద్రత, అధిక వేతనాలు, వత్తిడి లేని పనితీరు వంటివి లేకుండాపోయాయి. ఇకనైనా ప్రభుత్వాలు ఈ సమస్యల పై దృష్టి సారించి ఉద్యోగులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

వనితా! వందనం

విశ్వమంతా పరుచుకున్న భగవంతుని చైతన్యం ముచ్చటగా మూడు లక్షణాలను కలిగి ఉంది. అవి అవ్యాజమైన ప్రేమ, శాంతి, ఆనందోబ్రహ్మం. అందుకే సకల చరాచర సృష్టికి మూలమైన స్త్రీకి ఈ మూడు లక్షణాలతో పాటు, సహనాన్ని కూడా ఇచ్చాడు ఆ భగవంతుడు. ఎందుకంటే ఆమె ఏ క్షణంలో సృష్టి తనకు భారమనుకున్నా ఈ సృష్టే ఉండదు.. ఇదే ఆమెకున్న సాధికారం. దివ్య చైతన్య శక్తితో కూడుకున్న సాధికారం. ఆమెను తనలో సగభాగం చేసుకున్నాకే ఆమెతో సమానంగా నిలువగలుగుతాడు మగవాడు. అందుచేత ప్రతి పురుషుడూ అర్ధనారీశ్వరుడే. నాటికాలంలోని మహిళ నుండీ, నేటి ఆధునిక మహిళ వరకూ ఆమే కష్టజీవే. శివ-శక్తి అని భౌతికంగా రెండు వేర్వేరు లక్షణాలు రెండు ధృవాలుగా కనిపిస్తున్నప్పటికీ స్త్రీత్వం, పురుషత్వం ఒకే వ్యక్తిలో సహజంగా ప్రస్ఫుటంగా కనిపించే సహజ స్థితి. తండ్రి నుండి సంక్రమించే పురుష లక్షణాలు స్త్రీలోనూ ఉంటాయి. తల్లి నుండి సంక్రమించే స్త్రీ లక్షణాలు పురుషునిలోనూ ఉంటాయి. ఈ సత్యాన్ని అర్థం చేసుకుంటే ప్రతి వ్యక్తిలోనూ అంతర్గతంగా ఉన్న స్త్రీ, పురుష లక్షణాలను సమన్వయంగా పెంపొందించుకుంటూ మానవత్వాన్ని కలిగి ఉండాలి. అలాంటిది, ఇద్దరూ విభజనను ఏర్పాటు చేసుకొని నువ్వు గొప్పా, నేను గొప్పా అని వివాదాలకు తలపడుతూ ఎన్నో రకాల దోపిడీలకూ, పరపీడనలకూ దిగుతున్నారు. దీని వలన ఇద్దరిలోనూ ఆధ్యాత్మిక లోపమూ, ఆత్మానుభవ లోపమూ తద్వారా ప్రాపంచికంగా నీడలో అసమానత్వాన్ని చవి చూస్తున్నారు.

భారతదేశంలో రాజకీయ వ్యవస్థ కన్నా కుటుంబ వ్యవస్థ బలమైనది. మనిషి పుట్టిన దగ్గర్నుండీ మరణం వరకూ ఈ వ్యవస్థనే అంటిపెట్టుకొని ఉంటాడు. స్త్రీ, పురుషులిద్దరూ వివాహరీత్యా ధర్మార్థ, కామ, మోక్షాలను పొందుతారు. ఈ వ్యవస్థాపనకు మూలాధారమైన స్త్రీ స్థానం సమాజ దృష్టిలో దిగువ స్థాయిలో ఉండడం, ఆమె తన హక్కులను కోల్పోయి కష్టాలను అనుభవిస్తోంది. ప్రాచీన కాలపు స్త్రీకి విద్య ఉన్నప్పటికీ స్వేచ్ఛ లేదు. ఎన్నో దండయాత్రల వల్ల రక్షణార్థం లోపలే బంధింపబడింది. మధ్య యుగానికి వచ్చేసరికి మగవాడి దౌష్ట్యానికీ, సాంఘిక దురాచారాలకు బలయిపోయింది. కందుకూరి వీరేశలింగం పంతులు, రాజారామ్మోహన్ రాయ్ వంటి సంఘ సంస్కర్తల నుండి వెంకటాచలం లాంటి ఆధునిక రచయితల వరకూ స్త్రీ స్వేచ్ఛ కోసం వివిధ స్థాయిల్లో పాటు పడ్డారు. ఎట్టకేలకు స్త్రీ 19వ శతాబ్దానికొచ్చేసరికి బయటికి రాగలిగా, సమాజ ఆదరణ పూర్తిగా లేక ఆమెకు చుక్కెదురే అయ్యింది. అప్పుడు పుట్టింది 'స్త్రీ వాదం'. దానికి ఆయువును పోసింది పత్రికా రంగం.

కవర్‌స్టోరీ

శ్రీసత్య గౌతమి,

ఫిలడెల్ఫియా, యుఎస్ఎ

ఎటువంటి స్థితిగతుల్లో ఉన్న స్త్రీనైనా జాగృతం చేయడమే ముఖ్యోద్దేశంతో ఎంతోమంది స్త్రీలు, మారిన పురుషులు పత్రికలను నడిపి, స్త్రీలకు తమ హక్కులనూ, స్వేచ్ఛనూ తెలియపరిచారు. ఇక్కడికొచ్చేసరికి ఎంతో కాలంగా పురుషులపై ఆధారపడిన స్త్రీ జాగృతమై తన స్వభావాన్ని మార్చుకుంటూ ఇతర స్త్రీలను మార్చడానికి సామాజిక పాత్రను పోషించింది. స్త్రీవాద కవయిత్రులుగా ఓల్గా, జయప్రభ, పాటిబండ్ల, మహెజబీన్, షాజహానా మొదలైన కవయిత్రులు ప్రసిద్ధి చెందారు. స్వాతంత్ర్యానంతరం స్త్రీ ఎదుర్కొనే ఉద్యోగ సమస్యలు, ఇతర సమస్యల గురించి మొట్టమొదటిసారిగా నవల రాసిన రచయిత్రి మలతీచందూర్. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న కుటుంబాల పరిణామాల గురించి ఆమె రాసిన 'హృదయనేత్రి' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ద్వివేదుల విశాలాక్షి, కె.రామలక్ష్మి కుటుంబ సమస్యల గురించీ, స్త్రీ ఎదుర్కొనే సామాజిక సమస్యల గురించి నవలలు రాస్తే; యద్ధనపూడి సులోచనారాణి 'సెక్రటరీ' అనే నవలతో మొదలుపెట్టి ప్రేమకథలను జోడించి ట్రెండ్ మార్చి ఎంతోమంది చదువుకొని ఉద్యోగాలు చేసే మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు.

అదే స్ఫూర్తితో కోడూరి కౌసల్యాదేవి, మాదిరెడ్డి సులోచన, సి.ఆనందారామం, పోల్కంపల్లి శాంతాదేవి స్త్రీకి చేయూత నిచ్చే నవలలు, కథలు రాశారు. ఆ కాలంలోనే వీళ్లకి భిన్నంగా అభ్యుదయ భావాలతో నవలలు రాసినవారు రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, శారదా అశోకవర్ధన్. స్త్రీ వాదంతో నవలలకు శ్రీకారం చుట్టిన మహిళ ఓల్గా. దొప్పలపూడి అనసూయాదేవి 'కానుపు', 'పాకీపని' అనే పద్యాల్లో మాతృత్వాన్ని వర్ణిస్తూ స్ఫూర్తినిచ్చారు. ఎవరూ రాయాలనుకోని విషయాలను కూడా కవితా వస్తువులుగా తీసుకొని మహిళలు.. సాటి మహిళల కష్టాలను, ఆలోచనలను, అనుభవాలను జగద్విదితం చేయడంలో సాహిత్యం ద్వారా ప్రముఖ పాత్ర వహించారు. స్త్రీవాదమనేది కేవలం హక్కుల పోరాటం కాదు. తనలో దాగి ఉన్న విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పగలిగే సామర్థ్యం. పువ్వు పుట్టిన వెంటనే పరిమళిస్తుందన్నట్టు వారి వారి సామర్థ్యాల పరకాలం లోకోద్ధరణ చేసిన మహిళలెందరో వీరు చేపట్టిన బృహత్కార్యాలకు స్త్రీ జనోద్ధరణే కాదు పురుషులలో మార్పులు, సామాజిక ఉద్ధరణ జరిగింది.

రాణీ ఝాన్సీ లక్ష్మీబాయి

బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించి భారతదేశాన్నంతటినీ ఏకఛత్రాధిపత్యంలోకి తీసుకొచ్చిన ఝాన్సీ సైన్యంలో స్త్రీ, పురుషులిరువురూ ఉండేవారు. గరిట పట్టిన చేతులకు కత్తీ, డాలును ఇచ్చి రణవీరులను చేసింది ఝాన్సీ, స్త్రీలంతా బ్రిటిష్‌తో పోరాడి దేశరక్షణ గావించారు. మధ్య కాలానికొచ్చేసరికి రాజ్యకాంక్షలతో దేశాన్ని భక్షించే నాయకుల పరిపాలనలలో రక్షణను కోల్పోయిన స్త్రీ వంటింటి కుందేలయ్యింది. చదువుకీ దూరమయ్యింది. అలాంటి పరిస్థితిలో స్త్రీవాదం అప్పుడూ చోటు చేసుకున్నది. స్త్రీ తన సామర్థ్యాన్ని చూపించి, తన హక్కుల కోసం పోరాడింది. తనకు ఈ భూమిపై బతికే హక్కుందని చూపించింది.

సావిత్రీ ఫూలే

సావిత్రీ ఫూలేకు తన తొమ్మిదవ ఏటనే బాల్య వివాహం జరిగింది. నాటి సమాజానికి ఒక విలక్షణమైన గుణ ముండేది. చిన్న పిల్లలను ముసలివారి కిచ్చి పెండ్లి చేసేవారు. కన్యాశుల్కమనెడి దురాచారానికి ఆడపిల్లలు బలయిపోయే వారు. ఆడపిల్లలను చదివించేవారు కాదు. కేవలం లైంగిక దోపిడీకి ఆడపిల్లలను గురి చేసేవారు. ఆ కాలంలో సావిత్రీ ఫూలే తన భర్త జ్యోతీరావు ఫూలే సహకారంతో చదువుకున్నారు. ఆడపిల్లకు తన చుట్టూ జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించేందుకు చదువు వల్ల ధైర్యం వస్తుందని నమ్మి, సమాజాన్ని ఎదిరించి 1848లో భిడేవాడా, పూనేలో స్కూలు స్థాపించారు. సామాజిక పరిస్థితులను సంపూర్ణంగా అర్థం చేసుకొని స్త్రీ పట్ల ఉన్న వివక్షపై, ఆమె పట్ల జరుగుతున్న లైంగిక దోపిడీలపై ధ్వజమెత్తారు. ఆధునిక మహిళా సమాజంలో సావిత్రీ ఫూలే మొదటి స్త్రీవాది. లైంగిక దోపిడీల వల్ల గర్భవతులైన స్త్రీల పట్ల సమాజం అమానుషంగా ప్రవర్తించడమే కాకుండా వారికి పుట్టిన పిల్లలకు నిలువనీడ లేకపోయేది. దానితో ఎంతోమంది స్త్రీలు ఆత్మహత్యలకు పాల్పడేవారు. ఈ ఉపద్రవం నుండి కాపాడడానికి గర్భవతుల కోసం కేర్ సెంటర్‌ను స్థాపించారు. దాని పేరు 'బాల హత్య ప్రతిబంధక గృహం'. లైంగిక దోపిడీకి గురై గర్భవతులైన స్త్రీలను ఆ గృహంలో ఉంచి, వారిని చూసుకునే వారు ఫూలే దంపతులు. ఆ కాలంలోనే బల్బోనిక్ ప్లేగు వ్యాధికి గురై సావిత్రీ ఫూలే చనిపోయారు.

జస్టిస్ యానా చండీ

యానా చండీ భారతదేశపు మొదటి హైకోర్టు మహిళా జడ్జి. ఎనిమిది సంవత్సరాల పాటు కేరళ హైకోర్టు జడ్జిగా ఉండి, స్త్రీల ఉద్యోగ హక్కుల కోసం పోరాడారు. ఆమె ఉద్యోగాలలో రిజర్వేషన్‌కు పాటు పడ్డారు. అంతేకాకుండా స్త్రీ తన హక్కులను తాను తెలుసుకోవాలని 'శ్రీమతి' అనే పత్రికను స్వయంగా నడిపారు. అందులో ఆమె తన ఆటో బయోగ్రఫీని కూడా రాసారు. తాను సాధించిన ప్రగతి గురించి పూస గుచ్చినట్లు తరువాత తరాల కోసం రాసారు.

బేగం రోకియా

బేగం రోకియా అందరూ మర్చిపోయిన 19వ శతాబ్దపు మహత్తరమైన స్త్రీవాది. రోకియా షకావత్ హోస్సేన్ ఎడ్యుకేషనిస్ట్, సంఘ సంస్కర్త. 1880లో ఒక ధనిక కుటుంబంలో పుట్టిన రోకియా తన సిరిసంపదలను స్త్రీల హక్కుల పోరాటానికి వినియోగించారు. తన రచనల ద్వారా పురుషులతో స్త్రీ సమాన హక్కు కోసం పోరాడారు. 1932 కోల్‌కత్తాలో చనిపోయారు.

కెప్టెన్ ప్రేం మాథుర్

మహిళలు పైలట్‌గా పనికిరారని తీర్మానించి పురుష ప్రపంచం మాథుర్‌కు పైలట్ ఉద్యోగం ఇవ్వడానికి తిరస్కరించింది.

ఎనిమిది ఎయిర్‌లైన్స్ వాళ్లు ఆమెను తిరస్కరించారు. చివరకు హైదరాబాద్ దక్కన్ ఎయిర్‌వేస్‌వాళ్లు ఆమెకు పైలట్‌గా అవకాశమిచ్చారు. నేషనల్ ఎయిర్ రేస్‌లో పాల్గొని విన్నర్ అయ్యారు. బ్రిటిష్-ఇండియన్ పైలట్ లైసెన్స్ హోల్డర్ అయ్యారు. నాడు తాను వేసిన ప్రతీ అడుగు నేడు మహిళలకు స్ఫూర్తినిస్తోంది.

"స్త్రీ ఒక టీ బ్యాగ్ లాంటిది. దానిని నీట్లో మరిగించినప్పుడే తెలుస్తుంది, ఆ టీం ఎంత స్ట్రాంగో" అని ప్రస్తావించారు అమెరికా ఫస్ట్ లేడీ, స్త్రీవాది ఎలనార్ రూస్వెల్ట్. అది అక్షరాలా నిజం.

జేన్ ఆస్టిన్

జేన్ ఆస్టిన్ ఇంగ్లీషు నవలా రచయిత్రి. ఆమె నవలాంశాలన్నీ మధ్య తరగతి, ధనిక వర్గాల 19వ శతాబ్దపు కథలు, ముఖ్యంగా స్త్రీల జీవితాలపై రాసేవారు. ప్రైడ్ అండ్ ప్రిజుడీస్, ఎమ్మా అండ్ మన్స్ ఫెల్డ్ పార్క్ లాంటి ప్రసిద్ధి చెందిన నవలలు ఈమె రాసినవే. చాలా అరుదుగా ఉమెన్ రైటర్స్ ఉన్న టైములో తాను రచనలను చేసింది. తరువాతి ఉమెన్ రైటర్స్‌కు ఒక మార్గదర్శి అయ్యింది. ప్రపంచంలోకి రావడానికి భయపడే మహిళల కోసం ఎంతో స్ఫూర్తిదాయకమైన రచనలను తానందించింది.

మలాలా యూసఫ్ జెయి

పాకిస్తాన్‌లో స్థావరం ఏర్పరచు కొని, కాశ్మీరును ఆక్రమించుకున్న తాలిబాన్ తీవ్రవాదం పబ్లిక్ స్కూళ్లను రద్దు చేసి మగ పిల్లలను స్వాధీనంలోకి తీసుకొని వారి కార్యకలాపాలకు వాడుకొని, ఎన్నో ఏళ్ల ఆడపిల్లలకు అక్షర జ్ఞానం లేకుండా చేశారు. అలాంటి సామాజిక స్థితిని పాకిస్తాన్‌కు చెందిన ఒక మైనర్ బాలిక మలాలా యూసఫ్ జెయి ఆడపిల్లలు చదువుకునే హక్కు కోసం తన తండ్రి సహాయంతో తీవ్రవాదులతో పోరాడింది. ఈమె పాకిస్తాన్‌లో మింగోరా స్వాత్ వ్యాలీ 1997, జులై 12న పుట్టింది. ఈమె తన 15వ ఏట తాలిబాన్ల బుల్లెట్ల దెబ్బలు తిన్నా బతికి బయట పడింది. అయినా తన ఉద్యమాన్ని మాత్రం ఆపలేదు. తాను అనుకున్నది సాధించింది. గవర్నమెంటుతో కలిసి పని చేసింది. 2014వ సంవత్సరంలో మలాలా, కైలాశ్ సత్యార్థితో కలిసి నోబెల్ పీస్ ప్రైజ్‌ను అందుకున్నది. 2015లో గోర్డాన్ బ్రౌన్ యావత్ప్రపంచమంతా ఉన్న పిల్లలందరు తిరిగి స్కూళ్లకు వెళ్లాలని ఎడ్యుకేషన్ బిల్లును పాస్ చేయించారు. 2012లో అప్పటి పాకిస్తాన్ ప్రెసిడెంటు పది మిలియన్ల డాలర్లను మలాలా గౌరవార్థం ఫండ్‌ను రిలీజ్ చేశారు. ఆ ఫండు ప్రపంచమంతా ఉన్న ఆడపిల్లల విద్యా హక్కులకు, వారి చదువులకు వినియోగింపబడింది.

ప్రపంచం ఎప్పుడూ సామాజిక, ఆర్థిక, సాంకేతిక, సాంఘిక మార్పులు చెందు తుంటుంది. దీనివల్ల వచ్చే మార్పుల వల్ల విలువలు, బతికే విధానం, సత్యాలు, అలవాట్లు మారతాయి.

1908వ సంవత్సరం మార్చి 8వ తేదీన అమెరికా మహిళలు తమకు ఉద్యోగాలలో సమాన అవకాశాలు, సమాన వేతనాలు కావాలని భారీ ఎత్తున ఉద్యమం చేపట్టారు. ఈ చారిత్రాత్మక విషయాన్ని పురస్కరించుకొని, యావత్ప్రపంచమంతా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకుంటోంది. అయినా మహిళా ఉద్యోగాలలో, వేతనాలలో సమానత్వం కోసం ఇంకా పోరాడుతూనే ఉంది. అంతేకాదు, పుట్టినప్పటి నుండీ ఆడశిశువు బతుకుపోరాటం సాగిస్తోంది. మగశిశువుపై ఉన్నంత మొగ్గు ఆడ శిశువుపై లేకపోవడం వల్ల భారతదేశంలో ఆడశిశువులు తల్లి కడుపులో ఉండగానే అబార్షన్ల పేరు మీద ప్రాణాలు కోల్పోతు న్నారు. ప్రపంచంలో కన్ను తెరవక ముందే శాశ్వత నిద్రలోకి జారుకుంటున్నారు. స్కానింగుల ద్వారా గర్భంలో ఉన్నది ఆడశిశువు అని తెలిసిన వెంటనే ఆమెను తల్లి గర్భంనుండి తొలగించే పురుషాధికత్వతకు ప్రాణాలను కోల్పోతోంది. సృష్టికి మూలాధారం స్త్రీయేనని తెలిసినప్పటికీ ఆమెకు ఇంకా గుర్తింపు లేకపోవడం సామాజిక వైఫల్యంగానే చెప్పవచ్చు.

విదేశాల్లో స్త్రీల హక్కుల కోసం పోరాటం అనేది మొదటి ప్రపంచ యుద్ధం (1914-1918) సమయంలో మరింత ఊపును పుంజుకున్నది (మొదలైంది). అయితే స్త్రీల సాధికారత కూడా ఆ యుద్ధంతోనే మొదలైంది. ఆ యుద్ధంతోనే ముగిసింది.

మగవారందరూ యుద్ధానికి వెళ్లడం వల్ల స్త్రీలకు వ్యాపార, ఉద్యోగావకాశాలను అమెరికా గవర్నమెంట్ కల్పించింది. కానీ వేతనాలు చాలా తక్కువ. యుద్ధం ముగిసాక, వారు తిరిగి ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. స్త్రీలను ఉద్యోగ, వ్యాపారాల్లోంచి తీసివేసారు. పైగా మగవారికి వేతనాలు ఎక్కువ. ఈ అసమానతలు పోవాలనీ, మహిళా సాధికారత నిలవాలనీ పోరాటాలు కొనసాగాయి. అంతేకాకుండా ఆడవారితో మగవారు ఉద్యోగ స్థలాల్లో పోటీలకు దిగడం మొదలైంది. ఉద్యోగినులకు యూనియన్లు, న్యాయ స్థానంలో ప్రత్యేక సెక్షన్లు, రిజర్వేషన్లు లేకపోవడంతో స్త్రీలు దారుణ పరిస్థితుల్లో వివక్షతకు గురయ్యేవారు. రెండవ ప్రపంచ యుద్ధానికి మగవారు వెళ్లాక, మళ్లీ స్త్రీలకు ఉద్యోగాలు, వ్యాపారాలు చేతిలోకి వచ్చాయి. పడమటి దేశాల్లోని స్త్రీలకు మెరుగైన జీవితం లభించింది. ఉద్యోగాల్లో స్వేచ్ఛా, టెక్నాలజీ, వైద్య సదుపాయాల వల్ల, వారు ఇంటి పనులను, ఉద్యోగాలను సులువుగా నిర్వర్తించడం మొదలుపెట్టారు.

అమెరికా వంటి అగ్రరాజ్యాల్లో కూడా స్త్రీలు పోరాటాలతో ఒక్కొక్క మైలురాయిని దాటుకుంటూ ముందుకెళ్లారు. 1960-1970లో ఉమెన్స్ లిబరేషన్ మూమెంట్‌తో పడమటి దేశాల్లోని స్త్రీలు దాస్య విముక్తులు కూడా అయ్యారు. సమాన హక్కులు, విభిన్న సంస్కృతుల ఆదరణ, ఉద్యోగ అవకాశాలకై ఎదురు చూసారు. ఈ పోరాటం, మరో స్థాయిని చేరుకోవడంతో వీరి రక్షణార్థం ఆదరణ, ఉద్యోగ అవకాశాలకై ఎదురు చూసారు.

ఈ పోరాటం, మరో స్థాయిని చేరుకోవడంతో వీరి రక్షణార్థం చట్టాలు, సెక్షన్లూ లీగల్ సిస్టంలో చోటు చేసుకున్నాయి. స్వదేశంలో అయినా విదేశాల్లో అయినా స్త్రీకి పోరాటం తప్పలేదు. స్త్రీ వాద మంటే దశాబ్దాల నుండి, ఆర్థికావకాశాల నుండి, రాజకీయ వ్యవస్థల వరకూ లింగభేదం లేకుండా సమాన హక్కుల కోసం చేసే ఒక యుద్ధం.

భారతదేశంలో పూర్వంకన్నా నేడు అధిక శాతంలో మహిళలు పని చేస్తున్నారు. అయినప్పటికీ పనివారిలో పురుషుల కంటే స్త్రీలు తక్కువ సంఖ్యలో ఉన్నారు. కానీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలలో మహిళల సంఖ్య ఆసక్తిదాయకంగా ఉంది. ఈ పరిశ్రమలో 30 శాతం పనివారు మహిళలే. పురుషులతో సమాన స్థాయిల్లో, సమాన జీతాలు తీసుకుంటున్నారు. గ్రామీణ భారతంలో మొత్తం స్త్రీ కూలీలు 89.5 శాతం మంది వ్యవసాయ, తత్సంబంధిత పరిశ్రమ విభాగాలలోనే పని చేస్తున్నారు. పంటల ఉత్పత్తులలో మహిళల శ్రమ 55-66 శాతం వరకు ఉంటుందని అంచనా. పాల కేంద్రాల్లో పని చేసేవారిలో కూడా స్త్రీలదే పై చెయ్యి, మొత్తం 94 శాతం పనిని మహిళలే చేస్తున్నారు. అలాగే కుటీర పరిశ్రమల్లోనూ 51 శాతం మంది మహిళలే ఉంటున్నారు.

భూ హక్కులూ, ఆస్తి హక్కులూ చూసుకుంటే, చాలా భారతీయ కుటుంబాలలో మహిళలు ఎటువంటి ఆస్తిని కలిగిలేరు. వీరు తండ్రి ఆస్తిలోని భాగాన్ని కూడా పూర్తిగా పొందరు. మహిళలను రక్షించే చట్టాల అమలు తక్కువగా ఉండడం వలన మహిళలు భూమి, ఆస్తి మీద కొద్దిపాటి హక్కునే పొందగలుగుతున్నారు. మరికొన్ని చట్టాలయితే భూ, ఆస్తి హక్కులకి సంబంధించి మహిళల పట్ల వివక్ష చూపిస్తుంటాయి. 1956 మధ్య కాలపు హిందూ వ్యక్తిగత చట్టాలు(కేవలం హిందువులకు, బౌద్ధులకు, సిక్కులకు, జైనులకు) మహిళలకు వారసత్వ హక్కులనిచ్చింది. కొడుకులకు తాతల ఆస్తిలో వ్యక్తిగత వాటా ఉంటే, కూతుళ్లకు కేవలం తండ్రి వాటా మీదే ఉంటుంది. ఏ కారణం చేతనైనా తండ్రి తన పూర్వీకుల ఆస్తిని వదులుకుంటే కూతుళ్లకు ఏమీ ఉండదు. కానీ కొడుకులు తాత వాటాను కలిగి ఉంటాడు. పెళ్లైన మహిళలకు భర్త ఆస్తిపై కూడా ఎట్టి హక్కు లేదు, దయతో భర్త ఆమె పేరు రాస్తే తప్పా. కానీ ఆమె ద్వారా అతని సంతతికి అతని ఆస్తిపై పూర్తి హక్కులున్నాయి. భారతదేశంలో క్రైస్తవ మహిళలు కూడా విడాకుల, వారసత్వ సమాన హక్కుల కోసం సంవత్సరాల పాటు ఇబ్బంది పడ్డారు. 1994లో అన్ని చర్చిలలోని మహిళా సంస్థలతో కలిసి సంయుక్తంగా 'డ్రాఫ్ట్'లా అనే క్రిస్టియన్ మ్యారేజ్, మాట్రిమోనియల్ కాజెస్ బిల్లుని ప్రవేశపెట్టారు. అయితే ఇప్పటికీ ప్రభుత్వం చట్టాలకు అవసరమైన సవరణలు చెయ్యలేదు.

ప్రస్తుత రాజకీయాలు

పంచాయతీ రాజ్(గ్రామీణ స్వపరిపాలనా వ్యవస్థ) సంస్థల ద్వారా దాదాపు పది లక్షలకు పైగా మహిళలు భారతదేశంలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్‌తో సహా బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచలప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసాయి. 73వ, 74వ రాజ్యాంగ సవరణల ప్రకారం స్థానికంగా ఎన్నుకొనే విభాగాలన్నీ వాటి మూడవ వంతు స్థానాలను మహిళల కోసం ఉంచుతారు. వివిధ స్థాయిల్లో రాజకీయ కార్యక్రమాల్లో మహిళల శాతం గుర్తించదగినంత పెరిగినప్పటికీ పరిపాలన, విధాన నిర్ణాయక స్థాయిల్లో ఇప్పటికీ మహిళలకు ప్రాతినిధ్యం పెద్దగా లేదు.

మహిళా కార్మికులు ముఖ్యంగా స్కీం వర్కర్లు వారి పనికి వేతనాల కోసం 'కార్మికులు'గా గుర్తించబడడానికి పోరాడుతున్నారు. మహిళా కార్మికులు సమాన వేతనాల కోసం, ప్రసూతి ప్రయోజనాల కోసం, కిచెన్, సురక్షితమైన పని ప్రదేశాల కోసం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేయాలని, కార్యాలయాల్లో, సమాజంలో గౌరవం కోసం పోరాడుతున్నారు. లేబర్ కోడ్‌ల రూపంలో కార్మిక వర్గంపై పాలక వర్గాల దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు ఇచ్చే సమ్మె పిలుపుల్లో లక్షలాది మంది మహిళా కార్మికులు పాల్గొంటున్నారు. మహిళా రైతులు తమ పేర్ల మీద భూమిని నమోదు చెయ్యాలనీ, తమను రైతులుగా గుర్తించాలని పోరాడుతున్నారు.

అమలుకాని కనీస చట్టాలు

యూనియన్లు లేకుండా దాదాపు 94 శాతం మహిళలు పని చేస్తున్నారు. వీరికి కనీస వేతనంగానీ, సమాన పనికి సమాన వేతనంగానీ అమలు జరగడం లేదు. మహిళలే పోషిస్తున్న కుటుంబాలు రెండు కోట్లకు పైగా ఉన్నాయి. కనీస వేతనాలు అమలు కాకపోవడం వల్ల పోషకాహారం సరిగ్గా అందక 48 శాతం శ్రామిక మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు, లక్షల మంది మరణిస్తున్నారు. ఈ దుర్భర పరిస్థితులకు/జీవనానికి కారణమైన విధానాలు మహిళా హక్కులను హరిస్తున్నాయి. లింగ వివక్షత అనేది కేవలం స్త్రీ సమస్య కాదు, దేశ ఆర్థిక పరిస్థితిని కూడా ప్రతిబింబిస్తుంది. స్త్రీ పురోగతి చెందుతున్నదంటే అది పురుషుని తిరోగతి అనే మూఢనమ్మకాన్ని ప్రజలు వదిలిపెట్టాలి. స్త్రీ, పురుషులిద్దరూ సమానత్వం కోసం కలిసి పోరాడాలి. ప్రసంగాలు, ప్రజెంటేషన్లు గెలుపొందిన మహిళల గురించే మాట్లాడతాయి. ప్రతి స్థాయిలో ఉన్న స్త్రీ సమస్యలను పట్టించుకోవాలి. వేశ్యావృత్తిని చేపట్టినవారు కూడా తమను కార్మికుల జాబితాలో చేర్చి హక్కులను కల్పించమని మానవ సంబంధాల హక్కుల సంస్థలతో కలిసి పోరాడుతున్నారు. ఇది పూర్తిగా నిష్పక్షపాత యుద్ధమే తప్ప మగవారికి వ్యతిరేక పోరాటం కానే కాదు. ❑

ప్రజల వింత నమ్మకాలు

శ్రీలంకలోని వెద్దాస్ అనే ప్రజల్ని గురించి తెలుసుకుందాం..
పర్వత, దట్టమైన అడవుల్లో వేలాది ఏళ్లుగా నివసిస్తున్న ఈ ఆటవికుల పుట్టుపూర్వోత్తరాల గురించి తెలీదు. బౌద్ధ సన్యాసుల రచనల వల్ల వీరిని గురించి లోకానికి తెలిసింది. శ్రీలంక తొలి రాజు విజయ అని మాత్రమే తెలుసు. అతను సింహానికి, రాకుమార్తె కు పుట్టాడని ఒక కథనం. విజయుని మొదటి భార్య తన పిల్లలత్తో కొండల్లో ఉండిపోయిందట. ఆ సంతానమే వెద్దాలు. ఆర్యుల్నించి తప్పించుకుని క్రీ.పూ.2000లలో ఉత్తర భారతాన్ని ఈ వెద్దాలు ఆక్రమించే ప్రయత్నం చేశారు. 1911 లెక్క ప్రకారం 5,300 మంది ఉండే వెద్దాల జనసంఖ్య 1964లో శ్రీలంక ప్రభుత్వ లెక్క ప్రకారం 800కి తగ్గిపోయింది.

విశాలమైన ద్వీపం ఫార్మోజా

ఫార్మోజా (చైనా భాషలో తైవాన్) అతి విశాలమైన ద్వీపం. ఫార్మోజా జలసంధితో ఇది చైనా నించి విడిపోయింది. 66 చిన్న చిన్న ద్వీపాల వైశాల్యం కేవలం 127 చ.కి.మీ. చైనీయుల కన్నా ముందే ఇక్కడ ఆటవికులున్నారు. 2 లక్షల జాతులు ఉండేవట! మనిషిని చంపి తినే ఆటవికులు కావటంతో పాటు వారితో వారు మతం కోసం యుద్ధాలు చేసేవారట. యుద్ధానికి దిగేముందు ఒక పక్షిని స్వేచ్ఛగా వదిలేవారు. అది ఏ దిక్కుగా ఎగిరితే ఆటు వైపే యుద్ధం చేసేవారు, వెళ్లేవారు. శత్రుత్వం, అసూయ కాక అది ఒక సంప్రదాయంగా, మతాచారంగా ఆ ఆటవికులు ప్రవర్తించేవారు. తమ గ్రామంలోని ప్రతిఒక్కరూ విధిగా యుద్ధంలో పాల్గొని తీరాలి.

'ఎస్కిమో' అంటే?

టండ్రా ప్రాంతంలో నివసించే ఎస్కిమోలాకు ప్రాంతంలో ఉండే రెడ్ ఇండియన్స్ 'ఎస్కిమో' అనే పదం వాడారు. దాని అర్థం ఏమంటే 'పంచి మాంసం తినే వ్యక్తి' అని. వేట, చేపల్ని పట్టి, పచ్చిగానే తింటారు చలికాలంలో. మరి నిప్పు రాజేయటం చాలా కష్టం కదా! రాయి, మట్టిమూకుడులో సీల్, వేల్ కొవ్వుతో అగ్గి రాజేస్తారు. ఆ మంటపై మాంసాన్ని కాల్చినా వెంటనే చల్లారుతుంది, ఎండిపోతోంది. కూరలు ఉడకవు కనుక జంతువుల కిడ్నీ, లివర్ తిని విటమిన్స్‌ని పొందుతారు. సీల్ ప్రాణిని పట్టడానికి ఎంతో కసరత్తు చేస్తారు. తనే ఒక సీత్ వేషంతో గంటలకొద్దీ కదలకుండా పడుకుంటాడు. సూర్యరశ్మితో సేద తీరే సీల్ దగ్గరికి తనే జరుగుతాడు. శీతాకాలంలోనే సీల్‌ని వాటాడుతారు ఎస్కిమోలు. పైన మంచు పేరుకున్న నీటి అడుగున సీల్స్ ఉండి ప్రతి 7, 9 నిమిషాలకోసారి గాలి పీల్చుకోవటానికి మంచులో రంధ్రాలు చేస్తాయి. అది ముట్టెను ఆ రంధ్రం దగ్గరుంచి బైటికొచ్చేదాకా ఎస్కిమో కదలకుండా ఉండి, ఆపై హఠాత్తుగా తన ఆయుధం హార్మూన్‌తో దానిపై దాడి చేస్తాడు. సీల్‌తో వాటర్ బాటిల్స్‌తో చేసి తన గుండెదగ్గర వేలాదీస్తాడు. పైన ఉన్ని దుస్తులుంటాయి. కనుక నీరు గడ్డ కట్టదు. దాని చర్మంతో దుస్తులు, కాలి షూస్ తయారు చేస్తాడు.
ఇక ఎస్కిమోలు లెక్క పెట్టే విధానం చూద్దాం.. ఎడమ చేయి చిటికెనవేలుని ఒకటిగా, కుడి చేయి చిటికెన వేలుని 6గా లెక్కపెడ్తాడు. వేసవిలో యుమియాక్స్ అనే పెద్ద చర్మంతో చేసిన పడవను, చెక్కను వాడకుండా కాయక్ అనే చిన్న పడవను తయారు చేస్తారు. సీల్ ప్రాణిచర్మం, ఎముకలతో చేస్తారు దీన్ని.

...

బ్రెజిల్‌లోని ఆదివాసీలు అమెజాన్ నదీ ప్రాంతంలో అనాగరిక పద్ధతిలో నివసించే ఇండియన్స్‌గా పిలవబడుతున్నారు. యుద్ధం, విందు-వినోదాల సమయంలో కొన్ని రకాల మూలికలత్తో మొక్కల రసాల్తో ఒంటికి రంగు అద్దుకుంటారు. ఉనుకు ఒనొటా అనే మొక్కల్నించి ముదురు ఎరుపు రంగు, అమెరికన్ జునిపర్ నించి నీలి ద్రావణం తయారు చేస్తారు.

(మిగతా 19వ పేజీలో)

అహంకారం వీడితేనే..

అదొక అందమైన తోట. ఓ నాలుగు ఆకులు ఉన్నట్టుండి మాట్లాడుకోవడం మొదలుపెట్టాయి. ఎవరు గొప్ప వాదులాడాయి. అవి: అరటి, తమలపాకు, కరివేపాకు, తులసి. ముందుగా అరటి ఆకు "నేను అన్ని ఆకులకంటే శ్రేష్ఠమైన దానిని. ఎవరిల్లయినా కావచ్చు, ఏ విందైనా కావచ్చు. అన్ని రకాల రుచులు ముందుగా నాకే వడ్డిస్తారు. నన్ను ఆధారం చేసుకునే అందరూ తింటారు. కనుక నేనే మీ అందరికన్నా శ్రేష్ఠమైనదానిని" అంటూ గొప్పలు పోయింది.

అయితే అరటిఆకు పక్కనే ఉన్న తమలపాకు పెద్దగా నవ్వింది. "ఓసీ పిచ్చిదానా, నీకేమాత్రం బుద్ధి లేదు. నీకు నువ్వే శ్రేష్ఠమని అనుకుంటే ఎలా? అందరూ తిన్నతర్వాత నిన్ను చుట్ట చుట్టి చెత్తకుండీలోకి విసిరికొడతారు. నీ బతుకంతే. అక్కడితో నీ కథ ముగిసిపోతుంది. నాకు నేను గొప్పలు చెప్పుకుంటున్నానని అనుకోకు. కానీ చెప్పక తప్పట్లేదు. ఇది మీ అందరికీ గుర్తు చేస్తున్నానంతే. వంటలు రుచిగా ఉన్నాయంటూ ఆకలి ఉన్నా లేకున్నా అతిగా పెట్టించుకుని తింటారు కొందరు. అయితే అతిగా తినడంతో జీర్ణంకాక నానా అవస్థలు పడతారు. జీర్ణ ప్రక్రియ సజావుగా సాగడం కోసం అందరూ వెతికేది నన్నే.

కనుక నేనే గొప్ప" అంది తమలపాకు. అరటిఆకు, తమలపాకుల మాటలు కరివేపాకు ఇక ఊరుకుంటే లాభం లేదనుకుంది... "ఏమిటీ? నువ్వు శ్రేష్ఠమైనదానివా? నీకసలు బుర్రే లేదు. జీర్ణం కావడం కోసం నిన్ను చుట్ట చుట్టి నమిలి సారం మింగాక థూ థూ అంటూ పక్కన ఉమ్మేస్తారు. రోడ్లన్నీ నీ మరకలతో అసహ్యంగా తయారవుతాయి. అందరూ నిన్ను తిట్టుకుంటారు. అసలు చెప్పాలంటే నేనే అందరికన్నా ముఖ్యమైనదానిని. ఎక్కడ ఏ వంటైనాసరే.. నేను లేకుంటే ఆ వంట రుచిగానే ఉండదు. నన్నీ మనుషులు వంటల్లో వాడి తీరాల్సిందే" అంది కరివేపాకు.

అరటిఆకు, తమలపాకు, కరివేపాకు మాటలు విని కిసుక్కున నవ్వాయి. "నిన్ను వంటకాలలో వాడుతారు. నిజమే. కానీ ఏం లాభం? విస్తట్లో నిన్ను చూడటంతోనే ముందుగా మరీ మరీ ఏరి పక్కన పడేస్తారు. నీకు మనుషులిచ్చే విలువ కేవలం వంట వరకే. ఆ తర్వాత నిన్నెవరూ చూడనుగాక చూడరు" అని అరిటాకు, తమలపాకు, కరివేపాకు వంక చూసి వెటకారంగా నవ్వాయి.

ఈ మాటలన్నీ విన్న ఓ ఆకు మౌనం వీడింది.

"ఇదిగో.. మీరందరూ ఏవేవో అంటున్నారు. నా మాట వినండి. భక్తులు నాకిచ్చే ప్రాధాన్యం ఇంతా అంతా కాదు. భక్తుడు నన్నొక దండగా చేసి దేవుడి మెడలో వేసి దణ్ణం పెట్టుకుంటారు.నా పేరు తులసి. గుళ్లో తులసి తీర్థంకోసం భక్తులందరూ ఎంతలా ఎదురు చూస్తారో మీకు తెలీదా? అరిటాకూ! నీ అహంకారం వల్లే నువ్వేమో చెత్తకుండీకి పరిమితమవుతావు. మేకలో, ఆవులో నిన్ను మేసిపోతాయి. ఇక తమలపాకూ! నిన్నేమో ఏదో వంక పెట్టుకుని మనిషి నమిలి ఉమ్మి, వీధిపాలు చేస్తాడు. ఏ అహంకారమూ లేకపోవడం వల్లే నేను దేవుడి వద్దకు చేరాను. దేవుడి అలంకరణలో నేనొక ముఖ్య భాగాన్ని. కనుక మాటలు కట్టిపెట్టి మీ మీ పనులు చేసుకోండి" అంది తులసి వినయంగా. "నేను అనే అహంకారాన్ని వీడితేనే మనం భగవంతుడి వద్దకు చేరుకోగలం. అతని ప్రేమకూ, కృపకూ, అనుగ్రహానికీ పాత్రులమవుతాం" అని చెప్పిన తులసి మాటలతో అరిటాకు, తమలపాకు, కరివేపాకు ఏకీభవించాయి.

- యామిజాల జగదీశ్

జ్ఞాపక పుష్పం

పగడమల్లి/ ఇంటి పెరట్లో
ఆమె సాహసపు ముద్దు
అనుగ్రహించిన రాత్రి/ తడితో పీల్చిన వాసనను
నిన్న/ ఆ ఇంట్లో ఆఘ్రాణించాను.
మొక్కలో ఎర్రనైన కాడలోని/ పగడ పుష్పాలను చూడగానే
దాని పరిమళం

ఆమె నిశ్శబ్దపు వేడి నవ్వు.
యవ్వన ప్రాయంలో
నమ్మకంతో దగ్గరైన
దేహాన్ని స్పృశించినట్టుగా
ఒక పుష్పాన్ని తాకగానే
ఒక్క క్షణం/ ఎక్కడికో
ఒక సెకను/ తామరాకు నీటి జాడలో
ఈదే చిరుచేప పులకింత
ఆమెకు కలిగితే!/ మనుషులు లేని
ఈ ఇంట్లో/ దేవత ఉంది.

ఈ వారం కవిత్వం

- తమిళం: శీను రామసామి
అనువాదం: జిల్లేళ్ల బాలాజీ

చదువు

ఆమె చదువు
కుటుంబానికి వెలుగు
అతని చదువు
జీవితానికి జిలుగు
ఈ వెలుగు జిలుగులకు
వన్నెలు అద్దాలంటే
చదవాలనే
పట్టుదల ఉండాలి.
నిజం చెప్పనా..!
నీ చదువుకు
నీదే బాధ్యత
నీలోని ఆశయానికి
నీకు నీవే ఘనత
నీ ఎదుగుదలకు
ప్రయత్నించాల్సింది నీవే.

- శైలజామిత్ర

వృక్షదేహం

ఆ దేహం ఒక మోడుబారిన చెట్టు
అస్థిపంజరంలానున్న
ఆ చెట్టుపై కూర్చుని
తీతువు అదేపనిగా
వికృతంగా కూస్తోంది.
అదేంటోగానీ/ ఆ తీతువు అరుపు
శ్రావ్యంగా అనిపిస్తోంది.
కర్మ కాలడానికి/ సమయం దగ్గర
పడుతోందనే సంకేతంగా.
గాలిదుమారం కూడా
ఈడ్చి కొడుతోంది
నేల కూల్చేయడానికి కాబోలు.
ఈదురుగాలితో మొదలైన వాన
కళ్లల్లో వడగళ్ల వరద
ఆగకుండా కురిపిస్తోంది.
గుండెపై బలమైన
పిడుగులు కుమ్మరిస్తోంది
బహుశా కొన ఊపిరితోనున్న
చెట్టును అంతం చెయ్యడానికేమో.
అదే నిజమైతే
అంతకన్నా మరేం కావాలి?
నీరు పోసేవారు లేక
రాళ్లదెబ్బలంటి పరుషాలతో
వర్ధస్సు కోల్పోయి
చివరి శ్వాసతో నున్న ఆ మోడుకి
జీవితంలో దగాపడ్డ/కొందరి బతుకుల్లో
పరిస్థితి ఇలాగే ఉంటుందేమో!

- నాగమని.యం

పుస్తక సమీక్ష

చిన్నారులకు చిరుదీపం లాంటి కథలు

నేటిబాలలే రేపటిపౌరులు. నేటి బాలలను సక్రమమైన మార్గంలో తీర్చిదిద్దితేనే, రేపటికాలంలో దేశం సుభిక్షంగా ఉంటుంది. సక్రమమైన మార్గంలో నడిచి ప్రపంచ పౌరులందరికి మన్ననలను పొందగలుగుతుంది. మొక్కగా ఉన్నపుడే సరైన దిశానిర్దేశం చేస్తేనే వారు పెరిగి పెద్దయి ఆదర్శవంతంగా జీవించగలుగుతారు. ఇందుకు బాలసాహిత్యం ఎంతగానో తోడ్పడుతుంది. వారిని సక్రమమైన మార్గంలో పెట్టి మంచిచెడులపై స్పష్టమైన అవగాహన కల్పిస్తుంది. బాలసాహిత్యం ఇంతటి ప్రాముఖ్యగలదైనను, తెలుగులో అవసరమున్నంతమేర రావటము లేదు. బాలల సంరక్షణా బాధ్యత వహించే పెద్దలు ఇందుకు పూనుకోవాలి. వారిలో పఠనాసక్తి పెంపొందించి మంచి సాహిత్యాన్ని వారికి అందుబాటులో ఉంచాలి. ఈ దిశగా కృషి చేస్తున్నవారిలో విశాఖకు చెందిన రాజాగణేష్ ఒకరు. కథ, వచన కవిత్వంలో దిట్ట. లోగడ వీరు బాలసాహిత్యంలో 4 సంపుటాలను వెలువరించారు. బాలరంజని వీరి 5వ రచన. బాలలకు మనోవికాస విజ్ఞాన వినోదాన్ని కలిగించే ఈ బాలల కథాసంపుటిలో 35 కథలున్నాయి. సరళమైన భాషతో పిల్లలను పాత్రలుగా తీసికుని కథలు రాస్తున్నారు. పక్షులు రాబోయే ఉపద్రవాని కనిపెట్టగలగటం, కోకిలలు గుడ్లను పొదగలేకపోవటం లాంటి ఆసక్తికరమైన విషయాలను చిన్నారులు తెలుసుకోగలుగుతారు. మంచి కథలనందిస్తూ సమాజసేవ చేస్తోన్న రచయిత ఎల్.రాజాగణేష్‌ను అభినందనలు. **(బాలరంజని బాలల కథలు, ఎల్.రాజాగణేష్, వెల: రూ.120, ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు)** **- కూర చిదంబరం**

ఒక కాలం అనేక సమయాలు

సమయంతో ముడిపడి వడివడిగా సాగేకాలంతో ఆ జాడల ఊడలలో కవితాక్షర రూపాలలో, గిడుగు లక్ష్మీదత్ కవయిత్రిగా 'ఒక కాలం అనేక సమయాలు' తన అనుభవాలను, అనుభూతులను కవిత్వరీకరించారు. గిడుగు, కొవ్వని వారి సాహితీ ఔన్నత్యసంప్రదాయ కుటుంబ ప్రస్తావనలతో న్యూజెర్సీ ప్రవాస తెలుగింటి కవయిత్రిగా లక్ష్మీదత్ కవితలతో స్పందిస్తారు. కాలం సంగతులు సుదీర్ఘకవితలో 'మరుజన్మలో నిన్నేకొలుస్తా' అంటూ ఆరాధనాభావంతో కాలం నడక ఓ 'వైభవ సామ్రాజ్ఞి' అంటారు. జీవితంలో ప్రతి అనుభూతిని కాలంతో విశ్లేషిస్తూ, వివరిస్తూ, స్పందిస్తూ కార్యసిద్ధిని ప్రసాదించమని కాలం కళాకళలను కవితారూపంగా వ్యక్తీకరిస్తారు. ఈ సంపుటిలో కాలం ప్రధానాంశంగా ప్రవహించినా, 'అక్షరం అంతరించదు, అక్షరమే ప్రక్షాళన యుద్ధతంత్రం' అంటూ వ్యక్తిగత, సామాజిక కోణాలను స్పృశించే అంశాలున్నాయి. 'ఈ గుండె వేయిరేకుల పరిమళాలను చిందించే పువ్వు' అంటూ ప్రేమైక తాత్వికతను ప్రదర్శించే తీయని కలలున్నాయి.. ఆలోచనలు కవితలో నిప్పు కణికలా, అగ్గిపుల్లాలా వెలగాలని కవయిత్రి సూచిస్తారు. 'సదాగుణం', నీవు నా కిరణం' జీవితమే ప్రేమమయం', 'నీ నీడనై', 'నీతో ఎంతకష్టం' ప్రేమైక జీవులను పరవశింపచేస్తారు. 'నా కవితలో, కవయిత్రి అక్షరమే నా సర్వస్వం నా ఆకాశం కవితే నా ఊపిరి, నా సంతకంగా కాలాన్ని, కవిత్వాన్ని ఆరాధిస్తారు. **(ఒక కాలం అనేక సమయాలు, రచన: గిడుగు లక్ష్మీదత్, వెల: రూ 150, ప్రతులకు: 1-10-183/40/46/15, గాంధీనగర్, హైదరాబాద్)** **- యర్రమిల్లి**

'రాతిగుండెలో నీళ్లు'

మంచిప్రగడ సుబ్బరాయబోస్ లక్ష్మదంపతులకు ఈ కథా సంపుటి అంకితం చేసారు. చెరుకువాడ సత్యనారాయణ, డా॥జడ్డా సుబ్బారావు, వల్లూరి శివప్రసాద్, చక్కటి ముందుమాటలు రాసారు. ఈ కథలన్నీ వివిధ పత్రికల్లో ప్రచురణై పాఠకాదరణ పొందాయి. 16 కథలు ఈ కథాసంపుటిలో ఉన్నాయి. బిచ్చగాళ్లకు చేయూతనిచ్చే తీరును చెప్పిన కథ 'మళ్లీ చిగురించారు' వసంత్ చేసే పనులకు చెక్‌రూపంలో సహాయం ఉత్తరం ద్వారా పంపిన నవీన్‌లాంటి వారు సమాజానికి ఎంతో అవసరం అని చెప్పిన మంచి కథ. అలాగే 'యాచకురాలు' కథలో..యాచకురాలికి భోజనానికి డబ్బులిచ్చి వాటర్ ప్యాకెట్ కొని ఇచ్చాడు. అంతకుముందు హిజ్రాలకు డబ్బు ఇవ్వనివ్యక్తి యాచకురాలికి నలభై రూపాయలు ఇవ్వడం కథాంశం. అలాగే 'గుంటనక్కలు' కథలో. ఆకతాయిలు తనను అల్లరిపెడితే తెలివిగా తప్పించుకొని.. తండ్రిని తీసుకొని పోలీస్ కంప్లైంట్ ఇచ్చేస్థితిని తెల్పిన మరో మంచి కథ. మూఢనమ్మకాలు ఖండించే 'దిష్టి' కథ. భార్యాభర్తల అనురాగాన్ని 'కరోనా' అంశం ప్రధానంగా తీసుకొని చెప్పిన 'కొత్తస్వరం' కథలు బాగున్నాయి. అన్ని కథల్లో చదివించే గుణం పాత్రోచిత సంభాషణలు పాఠకుల్ని ఏకబిగువున చదివింపజేస్తాయి.16 కథలూ సామాజిక, సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి అందించిన కథలే, రచయిత ప్రయత్నం అభినందనీయులు.
(రాతిగుండెలో నీళ్లు, రచన: దొండపాటి కృష్ణ, వెల: రూ150, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకశాలలు) **- తంగిరాల చక్రవర్తి**

అభ్యుదయ భావాలు పుణికిపుచ్చుకున్న పాత్రికేయ కవి, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు వెలువరించిన తొలి కవితాసంపుటి 'మంచుపొగ'. ఈ కవికి ప్రముఖ దిగంబర కవి మహాస్వప్న ఆరాధ్యుడు. 'మనిషికి రెండుకళ్లు..మహాశివుడికి మూడు



'మంచుపొగ'కు చిల్చుకొచ్చిన అక్షరాలు

కళ్లు..మహాస్వప్నకు వొళ్లంతా కళ్లే' అంటూ నివాళులర్పిస్తాడు. 'కొందరు భావకవులు/ మరికొందరు అహంభావ కవులు/ కొందరు స్థలాభావ కవులు/ ఇంకొందరు సమభావ కవులు' అంటున్న ఉమ్మడిశెట్టి కాలంతో పోటీపడ్డ పరుగెడ్తున్న చైతన్య కవితా స్ఫురిస్తాడు. సంక్లిష్ట సమాజంలో సగటు మనిషి ఎంతగా నలిగిపోతున్నాడో చాలా కవితల్లో వివరిస్తాడు. రాజకీయ నాయకుల్లో కులగజ్జిపోవాలనీ, కులమతాలకు స్వస్తి పలికిన నాడే సమాజ పురోగతి సాధ్యమని తన కవిత్వం ద్వారా నినదిస్తాడు. ప్రపంచీకరణ, ఆధునీకరణ పేరిట అదృశ్యమవుతున్న పల్లెలపట్ల నాగేశ్వరావు ఆవేదన. 'ఇప్పుడు మాపల్లెల్లో సూర్యుడు/ టీబంకుల్లో కళ్లు నులుపుకొని/ ఏ బెల్టుషాపులోనో తొంగుటున్నాడు' ఇదీ..ఈనాడు పల్లెల దుస్థితి! 'మనసు ఊటబావి..ఎంతతోడినా తడి ఆరదు. 'శ్రీమహావిష్ణువుకు ఒక్కో జన్మలో ఒక్కో అవతారం/ గొంగళి పురుగుకు ఒకేజన్మలో రెండు అవతారాలు' వంటి ఆలోచనాత్మక పంక్తుల్ని కవితలనిండా ఆస్వాదించవచ్చు.
(మంచుపొగ, రచన: ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, ప్రతులకు: కె.పవన్‌కుమార్, లింగసముద్రం, ఎస్‌పిఎస్‌ఆర్, నెల్లూరు)
- రమణ వెలమకన్ని

వేసవి ఎండలు మండిపోవచ్చు!

మధ్యాహ్నం ఎండ అప్పుడే ఎండాకాలం వచ్చిందా? అన్నట్లుగా ఉంటోంది పరిస్థితి. ఈసారి ఎండలు ఎక్కువుంటాయోమో! అని కూడా అనిపిస్తోంది. అమెరికా వాతావరణ పరిశోధన సంస్థ జనవరి అంచనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలు మోత మోగిపోతాయని వెల్లడించడం ఆందోళన కలిగించే అంశం. వాస్తవానికి తెలుగు రాష్ట్రాలు మాత్రమే కాదు.. దేశం మొత్తమ్మీద గత మూడేళ్లలో వర్షాలకు ఏమాత్రం కొదవ లేకుండా పోయింది.

అదే సమయంలో వేసవిలో విపరీతమైన వడగాడ్పులు వీచాయి. కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో గత ఏడాది శీతాకాలం చలి వణికించింది. వాతావరణంలో వస్తున్న మార్పులకు ఇవన్నీ తార్కాణాలే. నాలుగేళ్ల విరామం తరువాత ఈ ఏడాది వేసవి సమయంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడవచ్చని, ఎండలు అసాధారణంగా ఉండే అవకాశం ఉందని అమెరికా పరిశోధకులు స్పష్టం చేశారు.

లానినా నుంచి ఎల్‌నినో వైపు?

అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్ఓఏఏ) ఈ ఏడాది వాతావరణంపై గత నెలలో ప్రాథమిక అంచనాలను వెలువరించింది. దాని ప్రకారం ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టుల్లో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడేందుకు యాభై శాతం అవకాశం ఉండగా, జులై మొదలుకొని సెప్టెంబర్ వరకు ఏర్పడేందుకు 58 శాతం అవకాశాలున్నాయి. అదే జరిగితే నైరుతి రుతుపవనాలు దెబ్బతిని వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయి. పసిఫిక్ మహా సముద్రంలో భూమధ్య రేఖ చుట్టుపక్కల సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడాన్ని ఎల్ నినో అని పిలుస్తారు.

ఇదే ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గితే అది లా నినా అవుతుంది. కాగా దేశంలో గత మూడేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురిసేందుకు కారణమైన లా నినా పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది ఎల్ నినో ఏర్పడేందుకు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు. అయితే కచ్చితంగా ఇలాగే జరుగుతుందని ఇప్పుడే చెప్పలేమనీ, రానున్న మూడు నాలుగు నెలల్లో పరిస్థితులు మారినా మారవచ్చని వీరు అంటుండటం ఊరటనిచ్చే అంశం. ఎన్ఓఏఏ మాదిరిగానే భారత వాతావరణ సంస్థ(ఐఎండీ) కూడా ఈ ఏడాది ఎల్ నినో పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఎక్కువని చెబుతోంది. అయితే ఎల్ నినో సీజన్ మొదలయ్యేందుకు ఇంకా మూడు నాలుగు నెలలు ఉన్నందున ఈ అంచనాలు తప్పు కావచ్చని కూడా పేర్కొంది. నెలాఖరుకు తాజా అంచనాలను విడుదల చేస్తామని ఐఎండీ డైరెక్టర్ తెలిపారు.

సమాచారం ఆందోళనకరమే : స్కైమెట్

ఈ ఏడాది ఎల్ నినో, లా నినా పరిస్థితులపై అందిన ప్రాథమిక సమాచారం ఆందోళనకరంగానే ఉందని దేశంలోనే తొలి ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ స్కైమెట్‌కు చెందిన మహేశ్ పలవట్ చెబుతున్నారు.

పరిస్థితులు లా నినా నుంచి ఎల్ నినో వైపుకు మారుతున్నాయంటేనే ప్రమాదం ముంచుకొస్తోందని అర్థం. రుతుపవనాల సమయంలో ఎల్ నినో ఏర్పడితే ఈ ఏడాది వర్షాలు తగ్గుతాయి. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే 2020లోనే లా నినా పరిస్థితులు ఏర్పడి, ప్రస్తుతం కూడా అదే కొనసాగుతున్నా ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో ఉండటం, గత ఏడాది కొన్నిసార్లు విపరీతమైన వడగాడ్పులు నమోదు కావడం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిల్లోనూ ఉష్ణోగ్రతలు కొంచెం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆ తర్వాత మాత్రం అసాధారణ స్థాయిలో ఉండవచ్చు" అని పలవట్ పేర్కొన్నారు.

తగిన ఏర్పాట్లు చేసుకోమన్నాం..

శతాబ్దం క్రితంతో పోలిస్తే 1.5 డిగ్రీ సెల్సియస్ వరకు పెరగవచ్చని అంచనా. గత ఏడాది భారత్‌లో కనీసం తొమ్మిది

మధ్యమ స్థాయి ఎల్ నినో రుతుపవనాలపై ప్రభావం చూపిస్తుంది. దీనివల్ల వర్షాలు కురిసే మోతాదు తగ్గుతుంది. కానీ ఇప్పటివరకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా మాత్రం రుతుపవనాలు సాధారణం కంటే తక్కువ స్థాయిలో ఉంటాయని చెప్పలేం. రానున్న మూడు నాలుగు నెలల్లో బంగాళాఖాతం, అరేబియా సముద్రాల ఉపరితల జలాల ఉష్ణోగ్రతల్లో తేడాల ఆధారంగా రుతుపవనాల తీవ్రతలో తేడాలు రావచ్చు. మొత్తంమీద ఈసారి ఎండలు తీవ్రంగానే ఉండబోతున్నాయి. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కూడా సూచించారు.

సగటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఈ ఏడాది ఎల్ నినో పరిస్థితులు ఏర్పడితే పాత రికార్డులు చెరిగిపోయే అవకాశం ఉంది. సగటు ఉష్ణోగ్రతలు

నగరాల్లో వేసవి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదైన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. ఉత్తర, వాయువ్య, తూర్పు ప్రాంతాల్లో తీవ్రమైన వడగాడ్పులు రావచ్చని గత ఏడాది ఐఎండీ హెచ్చరించింది.

సముద్ర జలాలు వెచ్చబడితే అధిక ఉష్ణోగ్రతలు

లా నినా పరిస్థితుల్లో తూర్పు నుంచి పశ్చిమం వైపు వీచే వాణిజ్య పవనాలు బలంగా ఉంటాయి. దీనివల్ల సముద్ర ఉపరితలంపై ఉండే వెచ్చటి నీరు పశ్చిమ దిక్కుకు ఎక్కువగా కదులుతుంది. అదే సమయంలో సముద్రపు లోపలి భాగంలోని శీతల జల ప్రవాహాలు తూర్పు వైపుకు ప్రయాణిస్తాయి. అధిక వర్షాలకు కారణమవుతాయి. ఎల్ నినోలో పరిణామాలు మాత్రం దీనికి వ్యతిరేక దిశలో ఉంటాయి.

వాణిజ్య పవనాలు బలహీనపడి ఉపరితలంపైన వెచ్చటి నీరు తూర్పు దిక్కుకు అంటే మన వైపు ప్రయాణిస్తుంది. అప్పటికే చల్లగా ఉన్న నీటిని ఇవి వెచ్చబెడతాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. ఇండోనేషియా, ఆస్ట్రేలియాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతుంది. ఫలితంగా రుతుపవనాలు బలహీనపడిపోతాయి. కరువులు, కార్చిచ్చులు ఎక్కువవుతాయి.

రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, ఫోమీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త,**
నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

కథ

ఇలాంటి వాడొకడుండాలి!

శ్రీగిరి అనే ఊళ్లో వుండే రవి, రాజు అనే ఇద్దరు యువకులు మంచి స్నేహితులు. పండగకి కొత్త బట్టలు కొందామని వాళ్లిద్దరు ఒకరోజు పట్నం వెళ్లారు. పట్నంలో పెద్ద పెద్ద భవనాలు చూస్తూ ఆనందిస్తూ ముందుకెళ్తుంటే మల్ల యుద్ధ పోటీలు జరిగే ప్రాంగణం కనిపించింది. ఇద్దరికీ మల్లయుద్ధ పోటీలంటే ప్రాణమంత ఇష్టం.

ఇరువురూ ఆ ప్రాంగణం లోపలికి వెళ్లారు. ప్రాంగణం ప్రేక్షకులతో నిండి వుంది. ఎలాంటి కండలు తిరిగిన వస్తాదులు వస్తారోనని జనం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కానీ జనం ఆశ్చర్యపోయేలా ఒక బలాఢ్యుడు, వాడికి పోటీగా ఒక బక్కటోడు గోదాలోకి దిగారు. ఇంతలో మల్లయుద్ధ పోటీ నిర్వాహకులు జనానికి ఒక సవాలు విసిరారు. "వెయ్యి రూపాయలు పందెం కట్టి ఆ వస్తాదులిరువురిలో గెలవగలిగేది ఎవరో చెప్పగలిగితే పోటీల అనంతరం ఎవరు చెప్పిన వస్తాదు గెలుస్తాడో ఆ పందెంలో పాల్గొన్న వ్యక్తికి వెయ్యికి రెండు వేలు ఇవ్వబడుతుంది" ఇది సవాలు. జనానికి గెలవగలిగినవాడెవ్వడో అంచనా వెయ్యడం సులభంగా అనిపించింది. వెయ్యికి రెండు వేలు వస్తుందన్న ఆశతో చాలా మంది బలాఢ్యుడి మీద పందెం కాశారు. పందెం పట్ల రాజు కూడా ఆకర్షితుడయ్యాడు. రవితో ఉత్సాహంగా "ఇది చక్కని అవకాశం. పందెంలో మనమూ పాల్గొందాం" అన్నాడు రాజు. రవి నిశిత దృష్టి గలవాడు, లోతుపాతులు ఆలోచించకుండా నిర్ణయం తీసుకునేవాడు కాదు. కాసేపు ఆలోచించిన పిమ్మట పందెంలో మోసమున్నట్లు గుర్తించాడు.

"మిత్రమా, బలాఢ్యుడికి పోటీగా ఒక బక్కటోడ్ని ఎందుకు నిలబెట్టారో తెలుసా? అమాయక జనాన్ని ఆకర్షించడానికే. జనాన్ని బురిడీ కొట్టించి నిర్వాహకులు డబ్బులు దోచుకునే ప్రయత్నంలో వున్నారు. అక్కడ నిజమైన పోటీ జరగదు. ఇరువురు వస్తాదులు వాళ్ల అధీనంలో వుండేవాళ్లు కాబట్టి వాళ్లు చెప్పిన మనిషే నెగ్గుతాడు. ఎవరిని గెలిపిస్తే ఎక్కువ లాభం వస్తుందో నిర్వాహకులు వాళ్లనే గెలిపిస్తారు. జనమంతా బలాఢ్యుడిపైన పందెం కాశారు కాబట్టి అతడు ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవడు. నా అంచనా ప్రకారం గెలవబోయేది బక్క వ్యక్తే" అని రవి చెప్పింది వాస్తవమనిపించడంతో రాజు ఒడ్డున పడ్డాడు. తరువాత జరిగిన మల్లయుద్ధ పోటీలలో రవి అంచనా ప్రకారం బక్కటోడే గెలిచాడు. జనమంతా డబ్బులు పోగొట్టుకొని లబోదిబోమన్నారు. నిర్వాహకులకి రెండు లక్షల రూపాయల వరకు ఆదాయం వచ్చింది. వాళ్లు సంతోషంగా వున్నారు.

పేదవాళ్లు డబ్బులు పోగొట్టుకొని బాధపడుతుంటే రవి చలించిపోయాడు. ఏదో ఒకటి చెయ్యాలనుకున్నాడు. "ఇలాంటి మోసగాళ్లని ఊరికే వదిలిపెట్టకూడదు. చట్టానికి పట్టించాలి. వారికి తగిన శిక్ష పడేవరకు విశ్రమించకూడదు" అన్నాడు రవి రాజుతో.

"మోసపు సంపాదనకు అలవాటు పడినవాళ్లు దుర్మార్గులై ఉంటారు. వారి సంపాదనకు అడ్డుపడినవాళ్లను ఊరికే వదిలిపెట్టరు. జంతు ప్రదర్శనశాల సందర్శించడానికి వెళ్లి పులిబోన్లో తలపెట్టినట్లవుతుంది వారితో పెట్టుకోవడం. పట్నానికి ఎందుకు వచ్చామో ఆ పని నెరవేర్చుకుని వెళ్లిపోదాం పద" అన్నాడు రాజు భయంగా.

"ఎవరో ఒకరు కల్పించుకొని సమాజానికి చీడ పట్టించే ఇలాంటి మోసాల్ని ఎక్కడికక్కడ అరికట్టకపోతే సంపాదనకు సులభమైన మార్గంగా అనేకమంది మోసాన్ని ఎంచుకుంటారు. మనవంతుగా మనం ప్రయత్నిద్దాం" అన్నాడు రవి. ఇరువురి సంవాదంలో రవి మాట నెగ్గింది. రవి, రాజు ఇద్దరూ రక్షక భట నిలయానికి వెళ్లి మల్లయుద్ధ పోటీల నిర్వాహకులపై ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చారు. పోలీసులు నిర్వాహకుల్ని అరెస్టు చేశారు. ప్రజల సొమ్ము ఎవరిది వారికి ఇప్పించారు. తమ డబ్బులు తమకు దక్కడంతో జనం రవిని అభినందించారు. మల్లయుద్ధ పోటీల ముసుగులో మోసపు పందేలు నిర్వహించినందుకు న్యాయస్థానం నిర్వాహకులకి శిక్ష విధించింది.

- గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు



చందమామ బాలభారతం

వార్త ఆదివారం

బాలగేయం

టమాట పండు

టమాట పండు
ఎర్రని పండు
పొలంలో పండు
భలే రుచిగ ఉండు.
పేదోళ్ల పండు
పెద్దోళ్ల పండు
పోషకాలు మెండు.
ధర తక్కువుండు
ఏడాది పండు
ఎక్కడైనా పండు
ఎల్లలెరుగని పండు
కల్లలెరుగని పండు.

- పల్లోలి శేఖర్ బాబు

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

- కె.ఆకాశ్, ఖమ్మం

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వాతావరణంలోని నీటిఆవిరి భూమి మీదకు ఎలా చేరుతుంది?

జవాబు: ఆకాశ్! వాతావరణంలో అదృశ్యంగా ఉన్న నీటి ఆవిరిని 'ఆర్ద్రత' అంటారు. నీరు ఆవిరిగా మారి, నీటి ఆవిరి అవుతుంది. ఈ నీటి ఆవిరి నీరు లేదా మంచుగా మారటాన్ని ద్రవీభవనమని అంటారు. నీటి తుంపరల పరిమాణం, బరువు పెరిగినప్పుడు గాలికి ఈ తుంపరలను భరించే శక్తి లేక తేమరూపంలో భూమి మీద పడటాన్ని 'అవపాతం' అంటారు. అవపాతం- వర్షం, మంచు, పొగమంచు లేదా వడగళ్ల రూపంలో ఉంటుంది. మేఘాల నుంచి పెద్ద పెద్ద చుక్కలుగా నీరు పడటాన్ని వర్షం అంటారు. దీనిని వర్షమాపకంతో కొలుస్తారు.

- ఎస్.మనోహర్, రాజంపేట

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. శరీరం అలసట, మెదడు అలసట.. వీటిలో దేనివల్ల నిద్ర వస్తుంది?

జవాబు: మనోహర్! ఈ అంశం మీద పలు సిద్ధాంతాలు, రాద్ధాంతాలు ఉన్నాయి. శరీరాన్ని చైతన్యవంతంగా ఉంచుకోవడంతో భాగంగా శరీరంలోని విడుదలయ్యే కొన్ని ప్రత్యేక రసాయనాల సరఫరాలను నిరంతరం సాగేందుకు నిద్ర వస్తుందని కొంత మంది శాస్త్రవేత్తలు భావించారు. విపరీత ధోరణిలో ఆలోచించినా, తగిన విశ్రాంతి లేకపోయినా మెదడులోని 'వాసోకన్ స్ట్రిక్టర్' అనే నాడీ కేంద్రం అలసిపోతుంది. తద్వారా దానికి రక్తప్రసరణ బాగా క్షీణిస్తుంది. ఈ కారణంతో నిద్ర వస్తుంది. నిద్ర ద్వారా విశ్రాంతి పొంది, అలసట తగ్గగానే, రక్తప్రసరణ తిరిగి పుంజుకోగా మెలకువ వస్తుంది. ఇది మెదడుకు సంబంధించినంత వరకు నిద్ర రావడానికి హేతువు. ఇక, శరీర పరంగా చూస్తే మనం కష్టపడటం వలన శరీరంలోని కాల్షియం కొంత భాగం

వలస పక్షులు కనిపించే ప్రదేశాలు

వలస పక్షులను చూసేందుకు చాలామంది ఇష్టపడతారు. అయితే ఇవి ఎక్కడ కనిపిస్తాయో తెలియదు. ఏయేపార్కుల్లో ఎలాంటి పక్షులు ఉంటాయో గమనిద్దాం..

కియోలాడియో పార్క్

ఈ పార్కు రాజస్థాన్‌లో ఉంది. పక్షులను ప్రేమించే వారికి ఈ పార్కు స్వర్గధామం. ఈ పార్కులో సుమారు నాలుగు వందల పక్షులు కనిపిస్తాయి. సరస్ కొంగలు ఇక్కడ ప్రత్యేకం.

పాయింట్ కాలీమీర్ శాంక్చుయరీ

ఈ వైల్డ్ లైఫ్ శాంక్చుయరీ తమిళనాడులో ఉంది. ఇది వలస పక్షుల స్వర్గధామం. ఇక్కడ ఫ్లెమింగో, గుల్స్, సాండ్‌పైపర్స్, బ్లాక్ టెయిల్డ్ గాండ్విట్ వంటి పక్షులు కనిపిస్తాయి.

ఢిల్లీ ఎన్‌సీఆర్

శీతాకాలంలో వలస పక్షులు ప్రయాణించే మార్గంలోనే ఢిల్లీ ఉంది. ఒక్లా బర్డ్ శాంక్చుయరీలో మరికొన్ని పక్షులను చూడవచ్చు.

అండమాన్, నికోబార్ దీవులు

అండమాన్, నికోబార్ దీవులను సందర్శించేందుకు వలస పక్షులు కూడా ఒక కారణమే. కూకూ డవ్, సర్పెంట్ ఈగల్‌తో పాటు మరికొన్ని అరుదైన పక్షులు ఇక్కడ చూడవచ్చు.

నల్ సరోవర్ బర్డ్ శాంక్చుయరీ

ఈ నల్ సరోవర్ బర్డ్ శాంక్చుయరీ గుజరాత్ రాష్ట్రంలో ఉంది. శీతాకాలంలో ఈ శాంక్చుయరీకి వెళితే అరుదైన జాతుల వలస పక్షులను చూడవచ్చు. సెర్బియా నుంచి వచ్చే వాటర్ ఫాల్స్ ఇక్కడ చాలా ప్రత్యేకం.

కుమారకోం బర్డ్ శాంక్యుయరీ

కుమారకోం బర్డ్ శాంక్చుయరీ కేరళలో ఉంది. వెంబనాడ్ సరస్సు ఒడ్డున ఉండే ఈ శాంక్చుయరీలో శీతాకాలంలో అనేక పక్షులు కనిపిస్తాయి. కుకూ, వాటర్ డక్ మొదలైన జాతులు ఈ సరస్సులో అధికంగా కనిపిస్తాయి.

రణ్ ఆఫ్ కచ్, గుజరాత్

శీతాకాలంలో వలస వచ్చే పక్షులకు రాణ్ ఆఫ్ కచ్ ఒక ప్రముఖ గమ్యస్థానం. ఇక్కడ గ్రే ఫైపోకోలియస్ లాంటి అరుదైన పక్షులను చూడవచ్చు.

సందర్‌బన్ నేషనల్ పార్క్

ఈ పార్కు పశ్చిమ బెంగాల్‌లో ఉంది. ఇందులో సుమారు రెండు వందల యాభై రకాల పక్షి జాతులను చూడవచ్చు. స్టార్క్స్, శాండ్‌పైపర్ లాంటి పక్షులను చూడవచ్చు.

చిల్కా సరస్సు

చిల్కా సరస్సు ఒడిశా రాష్ట్రంలో ఉంది. ఈ ఉప్పు నీటి సరస్సుకు శీతాకాలంలో అనేక పక్షులు వలస వస్తుంటాయి. సెర్బియా నుంచి బాతులు ఇక్కడికి వస్తాయి.

ప్రజల వింత నమ్మకాలు
(10వ పేజీ తరువాయి)

కొన్ని ఆటవిక తెగలకు ఒంటినిండా పచ్చబొట్లు వేసుకునే ఆచారం ఉంది. వాటికి మంత్ర తంత్ర శక్తులున్నాయని నమ్ముతారు. ఇంకొందరు కేవలం మొహం పైనే పచ్చ పొడిపించుకుంటారు. తమ తెగను ప్రత్యేకంగా గుర్తించేలా వేయించుకుంటారు. కమయుర ఇండియన్స్‌లో యువకులు తమ కళ్ల కింద రెండు ముదురు నీలి రంగు వలయాల్ని దిద్దుకుంటారు. జివారో తెగవారు ఈ పచ్చబొట్టు వేయటానికి ప్రత్యేకమైన ముద్ర (మన రబ్బరు స్టాంపులాగా) తయారు చేస్తారు.

...

అమెజాన్ నదీ తీరంలో రకరకాల తెగలవారున్నారు. పియారో ఇండియన్స్ కలిసికట్టుగా తమ ఇళ్లని నిర్మించుకుంటారు. పైకప్పు ఖాళీగా ఉంచి సూర్యరశ్మి పడేలా చేస్తారు. 6 నుంచి 8 కుటుంబాలుండే వీలుగా గుడిసెల్ని కట్టుకుంటారు. ఇంకో విచిత్రమేమిటంటే. మానియాక్ అనే చెట్టుమూలిక విషపూరితమైంది. కానీ అమెజాన్ ప్రాంత ఆదివాసీలు దాన్ని ఎంచక్కా ఆహారంగా తీసుకోవటం మరీ విచిత్రం. టుపీ ఇండియన్ పదం. దీని అర్థం 'మాని ఇల్లు' అని. మాని అనే అందమైన చిన్నారి పాప వారి తెగ నాయకుని బిడ్డ ఏడాది వయసులో చనిపోతుంది. ఆమెని పాతేసిన చోట ఒక వింతమొక్క మొలిచింది. దాన్ని పెకలించిన పక్షులు మత్తులో మునిగాయి. కొన్నాళ్లకు ఆ మొక్కలో చిన్నారి మాని కనిపించింది. అప్పటినుండి టుపీ జాతివారు దాన్ని వాడటం ప్రారంభించారట. స్త్రీలు ఎంతో జాగ్రత్తగా ఆ మొక్కలోని విషాన్ని తీస్తారు. ఎన్నోసార్లు దాని గుజ్జుని నీటితో శుభ్రం చేసి ఎండబెడ్తారు. దాన్ని నమిలినప్పుడు మత్తుగా గమ్మత్తుగా ఫీలవుతారట!

ఇక.. ఇక్కడి ఆటవిక జాతివారు కురేర్ అనే విషాన్ని మొక్కల్నించి తీస్తారు. కొన్ని నిమిషాల్లోనే అది ప్రాణం తీస్తుంది. ఈ విషాన్ని తమ పవిత్ర సంప్రదాయంగా తరతరాలుగా తయారు చేస్తారు. ప్రత్యేక కత్తులతో చెట్ల బెరడుకి గాట్లు పెట్టి, నీటిని కుండలో బాగా మరిగించి ఈ బెరడుని వేస్తారు. నీరంతా ఇగిరిపోయి తారు లాంటి నల్ల జిగురు అదే విషం కుండలో మిగుల్తుంది. అది పూర్తిగా చల్లారకముందే తమ బాణాల్ని అందులో ముంచుతారు.

...

కుర్దూస్ ఒకప్పుడు దేశ దిమ్మరులు. మెసపటోమియా, టర్కీ, ఇరాన్ ప్రాంతాల్లో సంచరించేవారు. మేక చర్మంతో టెంట్స్ తయారు చేస్తారు. పురుషులు పశువుల్ని మేతకి తీసికెళ్తే, స్త్రీలు కార్పెట్స్ వేస్తారు.

- అచ్యుతుని రాజశ్రీ

మనసుంటే చాలు



పంతంగి శ్రీనివాసరావు

సన్నగా తుంపర ప్రారంభమై, అది జడివానగా మారింది. సాయంత్రంవేళ వాతావరణం ఎంతో ఉత్తేజకరంగా వుంది.

శ్రీకర్‌కు ఏమీ తోచడం లేదు. ఒక్కడే వున్నాడు. సురేష్ కూడా లేడు. బోర్ కొడుతోంది. ఇంటిదగ్గర ఒక సమస్య వుందని సూపర్ వైజర్‌కు చెప్పి వెళ్లిపోయాడు.

రెయిన్‌కోట్ వేసుకుని రూంకు తాళం వేసి బయటకు వచ్చాడు.

ఓ అర ఫర్లాంగు దూరం వుంటుంది చౌరస్తా. రోడ్డు పక్కనే ఓ గుడిసె వంటి హోటల్.

తనూ, సురేష్ అక్కడే భోజనం, టిఫినూ చేస్తుంటారు. ఖర్చంతా యజమానిదే. సూపర్‌వైజర్ వారానికో రోజు వస్తాడు. కాంట్రాక్టరు ఉడయవర్లుకు బాగా నమ్మినబంటు. ఇక్కడ రోడ్డు కాంట్రాక్టు, ఇతర కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టులు సాధించాడు ఉడయవర్లు.

సాధారణంగా బ్యాచ్‌లర్స్ మీదనే ఆధారపడుతుంటాడు ఉడయవర్లు. వారయితే పని జరిగే స్థలంలో ఒక రూం, తదితర సౌకర్యాలు కల్పిస్తే పడివుంటారని అతని ఉద్దేశం. పల్టీలు కొట్టి డిగ్రీ పూర్తి చేసి ఆవారాగా వున్న శ్రీకర్‌ను ఉడయవర్లు దగ్గర చేర్చాడు శ్రీకర్ తండ్రి. చదువులో తప్ప అన్ని విషయాల్లోనూ శ్రీకర్ ఫాస్ట్.

హోటల్‌కు చేరుకున్నాడు శ్రీకర్. చూరుకు పట్టుకున్న చినుకులు జారుతూ నేల మీద పడి టప్, టప్‌మని అప్పటికే ఊరిన తడిలో పడుతుంటే ఎంతో ఆహ్లాదకరంగా అన్పిస్తోంది.

సాయంత్రం స్నాక్స్ వేడి వేడి పకోడీలు బాణలిలో సుయ్యి సుయ్యిమంటూ తయారవుతోంటే నోట్లో లాలాజలం వూరుతోంది ఎవరికయినా.

"అమ్మాయ్ లక్ష్మీ! పట్నంబాబు వచ్చాడు. ఓ ప్లేట్ వేడి వేడి పకోడీలు ఇవ్వు" కేకేశాడు పకోడీలు మూకుడులోంచి తీస్తూ నూనెను అదుముతూ వెంకన్న, ఆ హోటల్ ఓనరు.

"అవునూ.. నువ్వొక్కడివే వున్నావు. నీ అసిస్టెంట్స్ ఎవరూ లేరా వెంకన్నా?" అడిగాడు.

ఓ ఇద్దరు చురుకైన కుర్రాళ్లను అటూ యిటూ సందడి చేస్తూ గతంలో గమనించి వున్న శ్రీకర్‌కు ఎందుకో వాళ్లు కన్పించకపోతే ఆ హోటల్ కొద్దిగా డల్‌గా అన్పించింది.

"ఒకడికి జ్వరం, ఒకడు నామాలుగాడు సడన్‌గా ఎగ్గొట్టాడు. ఏం చేయను? నేనొక్కడినే. ఇప్పుడు రెండు కార్లో, లారీలో హోటల్‌ముందు ఆగితే అప్పుడుంటుంది తతంగం. అందుకే నా ఇంటిది, నా కూతురూ తలో చేయి వేయటానికి రెడీ అయ్యారు. తప్పదు మరి" అన్నాడు వెంకన్న.

ఇంతలో ఓ మెరుపుతీగ ఓ ప్లేటునిండా పకోడీలు వేయసాగింది. వెంకన్న పక్కకు వచ్చి మరు నిమిషంలో ఆ ప్లేటును శ్రీకర్‌ముందు పెట్టింది.

ఆమెను పరిశీలనగా చూశాడు శ్రీకర్.

"ఓ.. కంట్రిబ్యూటీ"

నొక్కుల జుత్తు.. నున్నగా దువ్వి ఫ్రెష్‌గా వుంది. చామనఛాయ కలర్, ఆమె అందాన్ని మరింతగా ద్విగుణీకృతం చేస్తోంది" చుబుకం కింద సన్నటి చీలిక. నయనాలు అమాయకంగా వున్నాయి.

అప్పుడప్పుడు అరమోడ్పు కళ్లతో చూస్తుందేమో.. నయనాల చలనం మంత్రముగ్ధుల్ని చేస్తూ అలానే చూడాలనిపిస్తుంది.

కళ్లు తిప్పుకోలేకపోయాడు శ్రీకర్.

పట్నవాసానికి దూరంగా వుండే ఇటువంటి గ్రామసీమల్లో ఇలా సహజ సౌందర్యాలు సహజమేనేమో!

పదిహేను రోజులయింది.. వేస్టు.. ఇటువంటి సౌందర్యం ఈ ఊరిలో వుంటుందని ఊహించలేకపోయాడు శ్రీకర్.

ఆ... వర్కర్స్ లేరని పుట్టలో పాము బయటకు వచ్చినట్టు వచ్చింది కానీ ఇటువంటి అపరంజిని మరలా మరలా చూడాలంటే ఎలా..

"ఎవరూ లేరని నీ కూతురును శ్రమ పెడుతున్నావా వెంకన్నా?" మాట కదిపాడు శ్రీకర్.

"కూతురంటే స్వంత కూతురు కాదు బాబూ. మా చిన్నాన్న మనవరాలు. ఇక్కడే వుంటది. అప్పుడప్పుడు ఇక్కడకు వస్తుంటుంది. పనోళ్లు లేరుగా, ఇక్కడే వుండిపో.. అని చెప్పా" చెప్పాడు వెంకన్న.

"ఏమయినా చదువుకుందా?" కూపీ లాగాలనే నెపంతో అడిగాడు శ్రీకర్.

"చదువా.. నా బొందా. దానికి చదువబ్బలేదు. అయినా అంత స్థోమత దానిని కన్నవాళ్లకు లేదు. పొలం పనికి వెళ్తోంది, రాయుడిగారి పొలంలోకి.

"అద్గదీ.. అందుకే అంత పుష్టిగా, నిగనిగా మెరిసిపోతుందన్నమాట" తలచుకుంటేనే ఒళ్లు జివ్వుమంటోంది. అదీగాక వాతావరణ ప్రభావం దానికి తోడైంది.

పరిచయం చేసుకుంటే.. ఎలా చేసుకోవాలి? తప్పుగా అర్థం చేసుకుంటే మొదటికే మోసం వస్తుంది. అసలే మొరటు మనుషులు.. దేనికయినా తెగిస్తారు.

వాన కొద్దిగా తగ్గుమొహం పట్టింది. బయకొచ్చి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ఒక వ్యక్తి ఎదురొచ్చాడు.

"నమస్తే సారూ!" వంగి వినయంగా అంటోన్న అతడిని గమనించాడు.

అతను తమ దగ్గర వర్కరు.

"ఎటెలుతున్నావ్ ఏశాలూ!" పలకరించాడు శ్రీకర్.

"వెంకన్న దగ్గర టీ తాగడానికి వెళ్తున్నా సారు"

"సరేగానీ ఓ గంట తర్వాత అక్కడ నుంచి నాకో భోజనం పార్సిల్ పట్రా.. నా పేరు చెప్పి" అన్నాడు శ్రీకర్.

"అలాగే బాబూ.." అంటూ ముందుకు కదిలాడు ఏశాలు.

"కూర్చో.." రెండోసారి చెప్పగానే సంశయిస్తూ కూర్చున్నాడు ఏశాలు.

"చెప్పు ఏశాలూ! నీ కష్టం, నీ సంసారం గడవటానికి సరిపోతుందా?" అడిగాడు శ్రీకర్.

"లేదు బాబూ! మా ఇంటిది పొలం పనికి వెళ్తది"

"ఇక్కడ పొలంపనులు బాగా జరుగుతాయా?"

"ఆ.. బాబూ. ఇక్కడ కాలువలు బాగా పారుతాయి. చాలా మంది ఆడోళ్లు పొలంపనికి వెళ్తారు".

"అవునట.. ఇంతకుముందే వెంకన్న చెప్పాడు. వాళ్లమ్మాయి కూడనటగా" కూపీ లాగటానికి ప్రయత్నించాడు శ్రీకర్.

"ఓ.. లక్ష్మినా. ఆ పిల్ల అతని సొంత కూతురు కాదయ్యా. తల్లిలేని పిల్ల. తండ్రొక తాగుబోతు. పాపం.. ఆడికి లక్ష్మినే ఆధారం"

కొంత సమాచారం బయటకొస్తోంది.

"అయ్యో.. పాపం.. మరి ఆ పిల్ల పెళ్లి"

"ఆ.. ఎవడో మోతోడు దొరక్కపోతాడా?"

ఎక్కడో జెలసీ.. అటువంటి పుష్పం మట్టిపాలా! ఆ అమ్మాయిని ఎవరో..ఛ.. తనకెందుకు ఇటువంటి అమ్మాయిలు ఎందరో వుండి వుంటారు.

"పాపం.. ఆ అమ్మాయి ఏవయినా సహాయం తీసుకుంటుందా.. అడిగి చూస్తావా?"

తన లెజెండరీ కొద్దిగా తగ్గుతోంది.

"ఏంటి బాబూ! అడగమంటారా?" కొద్దిగా ధైర్యంగా ముందుకొచ్చి ఏశాలు..

"పట్నం దొరలంటే మహాపడిపోతారు..... నాకొదిలేయండి" అంటున్న అతనితో బెట్టుగా చెప్పాడు శ్రీకర్.

"ఏమిటిది.. నన్ను గురించి ఏమనుకుంటున్నావు?" ఆ గొంతులో పటుత్వం చేదు.

"ఇక నాకొదిలేయండి.. ఈ రోజే ఆ పిల్ల అయ్యకు ఇంత పోస్తే తాగి తొంగుంటాడు" చిన్నగా అంటున్నాడు ఏశాలు.

అప్పుడు ధైర్యం వచ్చింది శ్రీకర్‌కు.

ఐదొందలు నోటు తీసి ఇచ్చాడు.

అది అందుకుని బయటకొచ్చాడు ఏశాలు.

ఒక గంట తర్వాత..

తలుపు తట్టాడు ఏశాలు...

తలుపు తీశాడు శ్రీకర్. ఏశాలు పక్కనే లక్ష్మి. కరెంటు పోయినట్టుంది.. అంతా చీకటి.. రోడ్డంతా..

"తొందరగా పంపెయ్యండి బాబూ..

"ఇక్కడ పొలంపనులు బాగా జరుగుతాయా?"

"ఆ.. బాబూ. ఇక్కడ కాలువలు బాగా పారుతాయి. చాలా మంది ఆడోళ్లు పొలంపనికి వెళ్తారు".

"అవునట.. ఇంతకుముందే వెంకన్న చెప్పాడు. వాళ్లమ్మాయి కూడనటగా" కూపీ లాగటానికి ప్రయత్నించాడు శ్రీకర్.

పెళ్లి కావలసిన పిల్ల, అల్లరవుతుంది" గుసగుసగా చెపుతూ-

"అమ్మా చెల్లెమ్మా..లక్ష్మీ! బాబుగారు మంచోడు. జాగ్రత్త" అంటూ చిన్నగా ఏదో చెప్పి అక్కడ నుంచి తప్పుకున్నాడు ఏశాలు.

లక్ష్మి లోపలకు అడుగు పెట్టగానే తలుపులేశాడు శ్రీకర్.

క్యాండిల్ వెలిగించేంతలోనే కరెంటు వచ్చింది.

దిగ్గున వెలిగిన ఆ కాంతికి లక్ష్మి నయనాలు అల్లల్లాడాయి.

"కూర్చో.. భోంచేశావా?" అడిగాడు.

"ఊ.. " తల వంచుకుని చెప్పింది.

"ఫర్వాలేదు.. నాతో చేద్దువుగానిరా.. కొద్దిగా"

ఇంకా తల వంచుకునే వుంది.

రెండు ప్లేట్లు తీసుకువచ్చాడు.

లక్ష్మినే చనువుగా సర్దింది. కొద్దిగా వున్నది తను తీసుకుంది.

"చాలా..?" అడిగాడు.

"చాలు.. ఏదో మీకు తోడుగా.." అప్పుడు విప్పింది నోరు.

"ఫర్వాలేదు.." మాటలు వచ్చన్నమాట.

అతని మాటలకు కిసుక్కున నవ్వింది.

అలా నవ్వేప్పుడు పవిట సర్దుకుంది.

"హోటల్‌లో లంగా, ఓణీ మీద కన్పించావ్!"

"ఏం? ఈ చీర మీద బాలేనా?" మత్తుగా అంటోన్న ఆమె పెదవులపై తడి తళతళా మెరుస్తోంది.

"ఏం.. తేనె తాగి వచ్చావా?"

చిన్నగా నవ్వుతూ సిగ్గుతో తల వంచుకుంది.

కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, ఫోమీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com

భోజనం చేశాక టవల్‌తో చేతులు తుడుచుకుంటూ అడిగాడు "నన్ను పెళ్లి చేసుకుంటావా?" అని.

"గొప్పోళ్లు.. పెద్ద పెద్ద మాటలు అనొద్దు బాబూ"

"పోనీ.. నాతో వుంటావా?"

"గూడెం కట్టుబాట్లు.." తల వంచుకుని చెప్పింది నసుగుతూ.

కొద్దిగా నిశ్శబ్దం.

నిశ్శబ్దాన్ని చీల్చుతూ "నేను వెళ్లాలి.. ఎవరయినా చూస్తారు.

ఆలస్యమయితే ఇబ్బంది" చెప్పింది చిన్నగా.

"ఓ.."

అంటూ మరింత దగ్గరగా వచ్చాడు.

అలా తరచూ ఆనందకేళిలో తేలియాడుతున్న శ్రీకర్ ఆమెను ఎలాగయినా శాశ్వతంగా చేపట్టాలనే నిశ్చయానికొచ్చాడు.

ఇదిలా వుండగా అతని జీవితంలో ఓ కుదుపు.

తండ్రి ఫోన్‌కాల్ మీద తమ ఊరికి చేరుకున్నాడు శ్రీకర్.

అక్కడ తండ్రితో తన బాస్ ఉదయవర్లు.

"నక్కతోక తొక్కావురా" ఎదురుగా వెళ్లి ఆప్యాయంగా శ్రీకర్ భుజం మీద చేయి వేశాడు తండ్రి.

శ్రీకర్‌కు ఏమీ అర్థం కాలేదు.

ఉదయవర్లు కూతురిని నీకిద్దామని వచ్చాడురా. ఒక్కతే కూతురు. అతని కాంట్రాక్టులన్నింటి వారసత్వం నీదే.. వేరే గదిలోకి తీసుకువెళ్లి చెప్పసాగాడు తండ్రి.

"ఆ అమ్మాయిని చూడనైనా చూడలేదు.. ఒక పక్క లక్ష్మి గుర్తుకు వస్తోందతనికి.

"ఓస్.. అంతేనా!" అంటూ ఓ ఐదు నిమిషాల్లో ఫుల్ సైజ్, బస్ట్ సైజ్ ఫొటోలు రెండు తీసుకొచ్చి, కొడుకు చేతిలో పెట్టాడు.

వాటిని పరిశీలించసాగాడు శ్రీకర్.

"ఛ.. హిడింబికి ప్రతిరూపంలా.. నల్ల తుమ్మమొద్దులా వున్న ఆ రూపం చూసి ఖంగుతిన్నాడు శ్రీకర్. గుడ్లగూబ కళ్లు, ఏకోశానా ఆడతనం లేదు. బాలకృష్ణుని చేతిలో హతమయిన పూతన మరో జన్మ ఎత్తినట్టుంది.

ఎంతగానో ప్రతిఘటించాడు.

నయాన భయాన చెప్పసాగాడు తండ్రి.

"చూడరా.. నీ మొహానికి చదువు అంతగా అబ్బలేదు. అరకొర క్వాలిఫికేషన్స్.. ఎక్కడ చూసినా కాంపిటీషన్.. నువ్వో అన్‌ఫిట్ ఫెలోవి. ఈ అమ్మాయిని చేసుకుంటే నీ భవిష్యత్తు బంగారం.."

"చూస్తూ చూస్తూ ఈ అమ్మాయిని.."

"ఏం ఆడది కాదా.. సంసారానికి పనికిరాదా?"

"... ... ..."

బుజ్జగిస్తూ చెప్పాడు "చూడు శ్రీకర్! నువ్వీ అమ్మాయిని చేసుకోకపోతే ఇక ఉదయవర్లు కూడా నిన్ను పనిలో ఉంచుకోడు. చేసుకున్నావా.. ఒక్కతే కూతురు, కోట్లకొద్దీ ఆస్తి.."

"ఛ... ఈ అమ్మాయితో కలిసి..." ఊహించడానికే ఏదోలా వుంది.

"బాగా ఆలోచించుకో.. లేకపోతే నీ బతుకు బస్టాండే. నేనో మధ్య తరగతి జీవిని. నీ తాత నాకు ఆస్తిపాస్తులు ఇవ్వలేదు. నువ్వు కాదంటే ఆ అమ్మాయికి ఇక పెళ్లి కాదనుకోకు. తన కాంట్రాక్టులన్నీ నువ్వు చూసుకుంటావని ఉదయవర్లు ఆలోచన. బెట్టు చేయకు.." అంటూ హెచ్చరిక చేసాడు తండ్రి.

ఒక నాలుగు రోజులు గడిచాయి.

లక్ష్మి సాహచర్యంలో కొద్దిగా ఉపశాంతి లభిస్తుందని బయలుదేరాడు. అదీగాక సూపర్‌వైజర్ రెండు సార్లు ఫోన్ చేశాడు.

బస్సు దిగగానే ఎదురుపడ్డాడు ఏశాలు.

"దండాలు బాబయ్యా.." ఇదివరకు వంగి వినయం చూపేవాడు. ఇప్పుడు నిటారుగా నిలబడుతున్నాడు.

అది తన వీక్‌నెస్.

"ఏవిటి విశేషాలు?" అడిగాడు ఏశాలును.

దగ్గరకు వచ్చి "లక్ష్మికి మనువు కుదిరిందయ్యా" గుసగుసగా చెప్పాడు.

ఆశ్చర్యం.. అయోమయం..

"ఏ ఊరు..?" అడిగాడు.

"ఈ ఊరేనయ్యా. సారా కాంట్రాక్టర్ దగ్గర వుంటాడు అప్పిగాదని. పాపం.. ఓలి ఇచ్చుకోలేరుగా బాబూ. ఆడు వట్టి వికారపోడు. ఒక కాలు అవుడు కూడా. ఒక ప్రమాదంలో మొహం కూడా కాలిపోయింది. ఆడికి ఈ కుందనపుబొమ్మ.."

అతను చెప్పేది శ్రీకర్ చెవికెక్కడం లేదు. "ఒక్కసారి లక్ష్మిని పిలిపిస్తావా?" అడిగాడు శ్రీకర్.

"క్షమించండి బాబూ! ఇక కుదరదేమో.. మరీ తప్పదంటే రేపు ఉదయం నాట్ల పనికెళ్లేప్పుడు మిమ్మల్ని కలవమని చెపుతా.."

మరుసటి ఉదయం లక్ష్మికోసం తలుపులు తెరచి చూస్తున్నాడు.

చేతిలో సద్దితో వచ్చిన లక్ష్మిని గమనించాడు.

ఫ్రెష్‌గా ఉంది.

"ఏం లక్ష్మీ..! పెళ్లి కుదిరిందటగా!"

"అవును బాబూ!"

"మరి నా సంగతి..!"

"ఇక కుదరదు బాబూ. ఇప్పుడు నేను ఒకరికి స్వంతం. ఇక.." ఆగింది.

రెక్కోనా సోప్‌తో మలినం వదల్చుకున్నంత తేలికగా వుంది ఆమె మొహంలోని భావం.

"ఏశాలు చెప్పాడు.. నీక్కాబోయే భర్త ..ఛత్..ఎలా నచ్చాడు నీకు?"

తలెత్తి చూసింది. ఆమె మొహంలో కొద్దిగా క్రోధం.

"చూడండి బాబూ! ఆడు నా పెనిమిటి. ఆడి గురించి మీరు మాట్లాడటం అంత బావోదు.."

"మరి నీ సంసారం"

"ఆడు ఎలా వున్నా, నేనెలా వున్నా, నచ్చినా, నచ్చకున్నా చేసే సంసారం మనసుతోటే. అదుంటే చాలు. ఒకరి లోపం మరొకరికి తెలియదు. ఏదేమయినా ఆడు నా మనిషి. ఆడికి నేనంటే ఇష్టం. నేను ఆడి మీద ఇష్టం పెంచుకోవాలి.. అంతే!"

ఇక ఒక్క క్షణం కూడా అక్కడ నిలబడలేదు లక్ష్మి.

స్తన్నయిపోయాడు శ్రీకర్.

కొద్ది రోజుల తర్వాత..

ఆ ఊరిని వదిలిపెట్టాడు శ్రీకర్.

"దండాలు బాబయ్యా.." ఇదివరకు వంగి వినయం చూపేవాడు. ఇప్పుడు నిటారుగా నిలబడుతున్నాడు. అది తన వీక్‌నెస్. "ఏవిటి విశేషాలు?" అడిగాడు ఏశాలును.

దిగంబర కవులు 'ఆక్సిజనులు': శ్రీశ్రీ

సాహిత్యం

దిగంబర కవులు ఆరుగురు తమ అసలు పేర్లు కాకుండా నగ్నముని (మానేపల్లి హృషీకేశవరావు), నిఖిలేశ్వర్ (కంభిం యాదవరెడ్డి), జ్వాలాముఖి (ఆకారం వీరవెల్లి రాఘవాచారి), చెరబండరాజు(బద్ధం భాస్కరరెడ్డి), భైరవయ్య(మురుకుట్ల మన్‌మోహన్ సహాయ్), మహాస్వప్న(కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు) పేర్లతో, కసిత్వం+ కవిత్వం కలిపి దిగంబర కవిత్వంతో తెలుగు సాహిత్యంలో తిరుగుబాటు సంచలనం సృష్టించారు. సమాజం కుష్ఠ వ్యవస్థగా పతనమైందని, కలం, గళం ఎత్తి 'దిక్'లు మారుమోగించారు. తీవ్రాతి తీవ్రంగా గర్జించి, గాండ్రించి, కాండ్రించి సమాజ వ్యవస్థను అసభ్యం, అశ్లీలం చూడకుండా తిట్టారు. మొదటి కవితా సంపుటాన్ని 1965, మే 6న అర్ధరాత్రి 12 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాజధానీ నగరం హైదరాబాద్‌లో ప్రప్రథమంగా తాము దిగంబర కవులమని ప్రకటిస్తూ నాంపల్లి పాండు అనే రిక్షా కార్మికునిచే ఆవిష్కరింపచేసారు. అందులో ఈ ప్రపంచిక ఆచ్ఛాదనల్ని చీల్చుకొని కొత్త రక్తాన్ని ఇంజెక్ట్ చేయడానికి వస్తున్నామన్నారు. మళ్లీ 1966 డిసెంబరు 18న, విజయవాడ బీసెంట్ రోడ్ మీద, అర్ధరాత్రివేళ, హోటల్ క్లీనర్ జంగాల చిట్టి రెండవ సంపుటి ఆవిష్కరించారు. భయం భయంగా, బానిసత్వంగా, దుర్భర బానిసత్వంతో హేయంగా ఛండాలంగా వున్న ఆంధ్ర దేశమనే మురిగ్గుంటలోంచి రెండవ సంపుటి వెలువడింది.

ఇందులో ముందుమాటగా 'మేం ఏం కోరుతున్నాం' అనే శీర్షికలో సమకాలీన జీవితంపై, తమ దృక్పథం వివరిస్తూ ఏది ఎలా నశింపచేయాలో తెలియచేస్తూ కవితా రూపాలలో నిప్పులు చెరిగారు. ఇక మూడవ సంపుటి 1968 సెప్టెంబరు 14న అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు విశాఖపట్నం లక్ష్మీటాకీస్ సెంటర్‌లో అత్యంత దీనాతిదీనంగా బతుకుతున్న 'ఎడమనూరి యశోద' వేశ్య(బిచ్చగత్తె) 20 సంవత్సరాల యువతి చేత ఆవిష్కరింపచేసారు. కంచికచర్ల కోటేశుకి యిది అంకితం చేసారు. ఈ దేశంలో, ఈ భూగోళంలో ఊపిరి పీల్చే మనిషిఉనికి కోసం తపనపడి, అతడి భావిని చూసి వెక్కి వెక్కి ఏడ్చి పిచ్చెక్కి ప్రవచించిన కవిత అంటూ మొదటి సంపుటిలో, ఏ ఆచ్ఛాదనకి తల ఒగ్గని, ఏ భయాలకీ లొంగని నిరంతర సజీవ మానవుడి కోసం ఎలుగెత్తి పిలుస్తున్నాం' అంటూ రెండో సంపుటిలోనూ, 'నిజాలు చెప్పకుండా గొంతులను నొక్కేసే పరిస్థితుల్ని ప్రోత్సహించే విషవలయాల్ని సృష్టిస్తున్న వీళ్లందర్నీ, వీళ్ల పెంచి పోషిస్తున్న ఈ కుష్ఠ వ్యవస్థనీ, దుర్గంధ సంస్కృతినీ నాశనం చెయ్యడానికి నిజమైన మనుషులు కావాలి' అంటూ

మూడో సంపుటంలో నినదిస్తూ దిగంబర కవులు కవిత్వ తుఫానుతో సాహితీ ప్రభంజనం సృష్టించారు. తెలుగునాట యువతరంలో నాటి చారిత్రక పరిస్థితులలో సమాజంలో చెలరేగిన నాటి అలజడి ఫలితంగా, దిగంబర కవిత్వ ఉద్యమం తల ఎత్తింది. అంతే కాదు, గ్రీన్‌విచ్ విలేజ్ కేంద్రంగా 'బీట్ జనరేషన్', అమెరికాలో 'గ్రేజనరేషన్', బ్రిటన్‌లో 'యాంగ్రీ యంగ్‌మెన్', బెంగాల్‌లో 'హంగ్రీ జనరేషన్', హిందీలో 'నయా కవిత' వంటి యువతరం తిరుగుబాటులలో విభేదాలున్నా, ఆశయ సాధనలో ఒకే తపన నాడు స్పష్టమైంది. కృత్రిమతను వదిలిపెట్టి సహజ జీవనం కోసం, సంప్రదాయాల సంకెళ్లను విరగ్గొట్టి వినూత్న సమాజ నిర్మాణం కోసం, మనిషి తనలో నగ్నం(స్వచ్ఛత)గా వుండి, మహామానవ స్వప్న సాఫల్యం కోసం ఘర్షణ ఆహ్వానించేవాళ్లే ఈ యువ సాహిత్యోద్యమాలకు చెందిన యువకులు అన్నారు నాడు నిఖిలేశ్వర్. 21వ శతాబ్దంనాటి ప్రథమ సోపానం అధిరోహిస్తున్న నాటి ఆంధ్ర దేశం 1900 నాటి మనస్తత్వ భారంతో కుంగిపోతున్నదని, అటువంటి కుత్సిత పరిస్థితులలో దిగంబర కవులు ప్రవేశించారు. (1969 అక్టోబరు భారతి మాసపత్రికలో నూతలపాటి గంగాధరం రాసిన దిగంబర కవిత-దాని స్థానం వ్యాసంలో)

అభ్యుదయ రచయితల సంఘాన్ని ఉత్తర భారతావనిలో ప్రేమ్‌చంద్, సజ్జాద్ జహీర్ వంటి రచయితలు 'ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్'గా ప్రారంభించారు. 1936లో లక్నో సమావేశానికి అబ్బూరి రామకృష్ణారావు ఆచార్యరంగా వెళ్లారు. ఆ స్ఫూర్తితోనే తెలుగులో తర్వాత 'అరసం' ప్రారంభమైంది. దేశానికి స్వాతంత్ర్యం రాని ఆ రోజులలోనే 'అరసం'పై కమ్యూనిజం ప్రభావం వుంది. 1930 తర్వాత ప్రపంచమంతటా ఆకలి, దారిద్ర్యం విలయతాండవం చేసాయి. బోల్షివిక్ విప్లవానంతరం సోవియట్ రష్యా సాధించిన విజయాలు దేశ దేశాలలో దోపిడీ, పీడన విముక్తి పోరాటాలు సాహిత్యంపై ప్రతిబింబించాయి. కావ్య వస్తువు కోసం కావ్యాలు వెదికే తెలుగు రచయితలు, కవులు క్రమేపీ సమాజ జీవనంలోని కవితా వస్తువును గుర్తించారు. సామాజిక దృష్టితో 1933 నాటికి శ్రీశ్రీ 'జయభేరి' వెలువడింది. 1930-50 సంవత్సరాల మధ్య అభ్యుదయ కవితా ప్రస్థానంలో శ్రీశ్రీ మహా ప్రస్థానం ఆరాధ్యనీయమైంది. 1943లో తెలుగునాట అభ్యుదయ రచయితల సంఘం ఆలస్యంగా స్థాపించ బడినా చాలా సంవత్సరాల క్రితమే, అభ్యుదయ భావాలకు అంకురార్పణ జరిగింది. క్రమేపీ దిగంబర కవులు, పైగంబర కవులు, చేతనావర్త కవులు, విప్లవ కవులపై తెలుగు కవితా సాహిత్యంలో శ్రీశ్రీ రచనల ప్రభావం తెలుగు సాహితీ ప్రస్థానాన్ని మలుపు తిప్పింది. 1968 నాటికి దిగంబర కవులను ఆక్సిజనులుగా ముళ్లగులాబి పువ్వులు, ఆగ్రహ భార్గవులు, ప్రభువుల శిరసులపై పరశువులు పగబట్టిన చక్షుశ్శ్రువులు అంటూ మహాకవి శ్రీశ్రీ ఆహ్వానించారు.

- జయసూర్య

నిత్య జీవితంలో వాస్తు విషయాలు

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: **9885446501/9885449458**

మొదటి చూపు

ఉదయం నిద్ర లేవగానే కుబేర స్థానమయిన ఉత్తర దిశనుగానీ, ఇంద్ర స్థానమయిన తూర్పు దిశనుగానీ చూడాలి. తర్వాత భగవంతుని పటాన్ని లేదా, తమ అరచేతులను చూసుకోవాలి. ఆ తరువాత కుటుంబంలో తమకు ప్రీతిపాత్రమయిన మొహాన్ని చూడటం, చిన్న ముద్దు పెట్టుకొని చిరునవ్వుతో లేవటంతో ఉదయం శుభారంభం అవుతుందనటంలో సందేహం లేదు.

మొదటి నడక

నిద్ర లేచిన తరువాత మొదటి రెండు అడుగులు తూర్పు వైపుకు వేయటంవల్ల 'కార్యసాధన', ఉత్తరానికి వేయటం వల్ల 'ధనలాభం', ఈశాన్యానికి వేయటం వలన 'దైవకృప' లభిస్తాయి. అందుకే ద్వారాలను అటువైపు నడిచే విధంగా అమర్చుకోవటం మంచిది.

టాయిలెట్స్ విషయం..

బాత్‌రూమ్స్‌లో(టాయిలెట్) తూర్పుకు అభిముఖంగాగానీ, పడమరకు అభిముఖంగా కానీ కూర్చోవడం వల్ల చెడు ఫలితాలుంటాయి. అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవడం మంచిది. దక్షిణ ముఖంగా కూర్చోవాలి. వీలు కాని పరిస్థితుల్లో ఉత్తర ముఖంగా కూర్చోవచ్చు.

చెత్తను ఎటువైపు ఊడ్చాలి?

రోజువారీ పనుల్లో ఇల్లు ఊడ్చడం ఒకటి. ఒక గదిని చీపురుతో ఊడ్చి, ఆ చెత్తను ఒక మూలలో కొంచెంసేపు అలాగే వుంచి, తర్వాత తీరిగ్గా పారేస్తుంటారు కొందరు. ఇల్లు ఊడ్చేటప్పుడు ఆ చెత్తను ఈశాన్య మూలకు పోగు చేయకూడదు. ఈశాన్యమూల నుండి ఊడవటం ప్రారంభించి చెత్తను నైరుతి మూలకు పోగు చేసేలా గదిని చీపురుతో ఊడవాలి. పోగయిన చెత్తను అలాగే వుండనీయకుండా వెంటనే ఎత్తి చెత్తబుట్టలో వేయటమో లేదా బయట కుండీలో పారేయాలి. చెత్త దబ్బాను నైరుతి మూలలో ఏర్పాటు చేసుకోవాలి.

ఇల్లు ఊడ్చిన తరువాత చీపురును ఈశాన్య మూలల్లో పెట్టకూడదు. నైరుతి మూలలో చీపురు హాండిల్ పైకి వచ్చేలా, ఊడ్చే భాగాన్ని కిందకు వచ్చేలా నేల మీద పెట్టాలి. చీపురు శనిదేవుని ఆయుధం చీపురు శనిదేవుని ఆయుధం. ఆయన చేతిలో చీపురు పైకి ఎత్తి పట్టుకొని ఉంటుంది. ఇంట్లో అలాగే(హాండిల్ కిందకు వచ్చేలా) పెట్టిన చీపురు ఆయన ఉనికికి చిహ్నం. కనుక అలా పెట్టి కష్టాలు కొనితెచ్చుకోవద్దు. ఈశాన్యంలో

పూజ ఎలా చేయాలి?

ఈశాన్య మూలలో భగవంతుణ్ణి పూజించటం శ్రేష్ఠం అనే విషయం వాస్తవమైనా కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు

పాటించాలి.

ఈశాన్యంలో మూలకు దేవుని గృహం కట్టడం, ఈశాన్యంలో తూర్పు, ఉత్తరాలు కలిసే మూలలో అరుగుల నిర్మాణం గావించి, ఆ అరుగుల పైన(మెట్ల పైన) దేవుని పటాలు పెట్టి పూజించటం సరైన పద్ధతి కాదు. కోరి కష్టాలు తెచ్చుకోవాలంటే అలాంటి పనులు చేయవచ్చు. ఈశాన్య మూల చాలా సున్నిత మయింది, ఎటువంటి ఎత్తు/బరువు వుండకూడదు.

ఈశాన్య మూలలో ఒక చదరపు అడుగు నేలను అంటకుండా వదిలేయటం శ్రేష్ఠం. తూర్పుగోడకు నేల నుండి కనీసం ఒక అడుగు పైన, ఈశాన్య మూల నుండి ఒక అడుగు తర్వాత గోడలోనే గూడు(షెల్ఫ్)ను కట్టి అందులో భగవంతుని పటాలు పెట్టి తూర్పుకు అభిముఖంగా కూర్చుని పూజ చేసుకోవటం వల్ల చాలా మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఒకవేళ మందిరంలో బరువైన విగ్రహాలు పెట్టాల్సి వస్తే వాయువ్య మూలలో మందిరం నిర్మించి, పశ్చిమాభిముఖంగా పూజలు చేయడం మంచిది. అప్పుడు విగ్రహాలు తూర్పుకు అభిముఖంగా ఉంటాయి.

ఆగ్నేయ మూల వంట ఎలా చేయాలి?

వంట ఆగ్నేయంలో చేయాలన్నది వాస్తునియమం. అయితే పొయ్యిని పూర్తిగా ఆగ్నేయ మూలలో తూర్పు, దక్షిణ గోడలకు ఆనించి వంట చేయటం సరైన ఫలితాలనివ్వదు. పొయ్యి(స్టవ్) ఆగ్నేయ మూలలో తూర్పుగోడకు తగలకుండా వుండాలి. దక్షిణ గోడను ఆనుకొనివున్నా ఫర్వాలేదు. లేదా తూర్పు దక్షిణ గోడలకు ఆనుకొని లేకున్నా ఫర్వాలేదు.

ఆగ్నేయ మూల ఒక చదరపు అడుగు స్థలాన్ని ఖాళీగా వదిలేసి తూర్పుగోడను ఆనుకోకుండా స్టవ్ అమర్చి తూర్పుగా అభిముఖంగా నిలబడి లేదా కూర్చుని వంట చేయాలి. తూర్పుగోడలోకి గూడులా కట్టి ఆ గూట్లో స్టవ్ పెట్టి వంట చేయడం సరైన పద్ధతి కాదు.

ఈశాన్యంలో నీళ్లు ఎలా ఉండకూడదు?

ఈశాన్యంలో నీళ్లు వుండాలని చాలామంది అక్కడ నీళ్లు పట్టి పెట్టే ప్రయత్నం చేస్తారు. అక్కడ బోర్‌వెల్‌గానీ, పంపుగానీ, బావిగానీ లేకపోతే, అవి ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా లేకపోతే డ్రమ్ముల్లో నీళ్లు నింపి అక్కడ పెడుతుంటారు. అది మంచి ఫలితాలు ఇవ్వకపోగా చెడు ఫలితాలనిస్తుంది. ఈశాన్య మూలలో భూమి లెవెలుకంటె తక్కువ లెవల్లో నీటిని పట్టి వుంచాలి. అంటే 'సంప్' లాంటిది కట్టి నీళ్లని నిలువ చేయాలి. కానీ భూమిపైన డ్రమ్ముల్లో నీళ్లను పట్టిపెట్టి ఆ మూల భారం అధికం చేయటం వాస్తు నియమానికి విరుద్ధమయిన పని అవుతుంది. ❑

శిల్పకళా సంపదకు నిలయం 'హంపి'

షేక్ అబ్దుల్ హకీం జాని

ఒకప్పటి వైభవ ప్రాభవానికి సజీవ సాక్ష్యంగా కంటతడి పెట్టించే కొన్ని శిథిల కళాఖండాలతో అలరారుతున్న కుగ్రామం హంపి. ఇది 13-15 శతాబ్దాలలో విద్యారణ్య స్వామి ఆశీస్సులతో స్థాపించిన విజయనగర రాజుల రాజ్య రాజధాని. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద సామ్రాజ్యాలలో విజయనగర సామ్రాజ్యం ఒకటి. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి జిల్లాలో హోస్పేటకు 15 కి.మీ. దూరంలో ఉంది. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలవారు పలికిన తేనెలూరే పలుకులు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. కర్ణాటకలోని హోస్పేటకు 15 కి.మీ. దూరంలో ఉన్న కమలాపురం నుండి హంపి కళాఖండాలు దర్శనమిస్తాయి. కాలగతిన శిథిలావస్థకు చేరుకుంటున్న ఈ శిల్పకళా సాగరంలో 14వ శతాబ్దంనాటి నగర అవశేషాలు 26 చదరపు కి.మీ. విస్తరించి శిల్ప కళా ప్రియులకు కంటతడి పెట్టించక మానదు. ఉత్తరం వైపు తుంగభద్రా నది, మిగిలిన మూడు వైపుల పెద్ద పెద్ద గ్రానైట్ శిలలతో అప్పటి విజయనగర వీధుల వైభవాన్ని తెలుపుతుంది. ఈ పట్టణంలో ప్రవేశిస్తుండగానే కనిపించే విశాలమైన భవంతులు, పెద్ద పెద్ద ప్రాకారాలు అప్పటి నగర నిర్మాణ చాతుర్యానికి అద్దం పడుతుంది. హంపి వీధులలో నడుస్తూ ఉంటే అత్యంత సుందరమైన నిర్మాణాలు, ప్రస్తుతం శిథిలమైన కళా సంపదను చూడవచ్చు.

నగరం ప్రధాన అవశేషాలన్నీ కమలాపురం నుండి హంపి వెళ్లే రహదారిలో కనిపిస్తాయి. కమలాపురం నుండి హంపి వెళ్లే దారిలో కమలాపురకు మూడు కి.మీ. దూరం మల్యంవంత రఘునాథ స్వామి దేవాలయం వస్తుంది. ఈ దేవాలయం ద్రవిడ ఆలయ నిర్మాణ శైలిలో నిర్మించారు. ఆ ఆలయంలో వైవిధ్యభరితంగా చెక్కబడిన చేపలు, జలచరాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయి.

తుంగభద్రా నదీ తీరాన వున్న హంపి నగరంలో జరిగిన తవ్వకాల్లో ఎన్నో అపూర్వ విశేషాలు వెల్లడి అయ్యాయి. ఇప్పటికీ కొన్ని పరమాద్భుత శిల్పాలు యాత్రికులకు నయనానందం కల్గిస్తున్నాయి. హరిహరరాయలు, బుక్కరాయలు అనే ఇరువురు సోదరులు 1336లో హంపిని నిర్మించారు. అప్పట్లో వీరు హోయసల రాజ్యంలో అధికారులుగా పని చేస్తుండేవారు. వీరు స్వతంత్రంగా ఒక సామ్రాజ్యాన్ని నిర్మించాలనుకున్నారు. ఆ ఆలోచనకు ప్రతిరూపమే విజయనగర సామ్రాజ్యం. వీరు స్థాపించిన విజయనగర సామ్రాజ్యం 1565 వరకు అనేక రకాల ఒడుదుడుకుల నెదుర్కొంటే ఇదే ఏడాది జరిగిన రాక్షసి తంగడి యుద్ధం విజయనగర భవితను దెబ్బతీసింది. అనంతరం ఇది 1689లో మొఘల్ చక్రవర్తుల పాలనలోకి వచ్చింది.

విరూపాక్ష ఆలయం

హంపికి పశ్చిమాన విరూపాక్ష ఆలయం ఉంది. 15వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యం స్వర్ణయుగాన్ని తలపించింది. ఎందరో విజయనగర ప్రభువులు హంపిని తీర్చిదిద్దారు. వారి కళాప్రియత్వానికి ముచ్చటనకగా నేటికీ కొన్ని శిల్ప కళాఖండాలు హంపిలో దర్శనమిస్తాయి. వీటిలో ముఖ్యమైనది విరూపాక్ష ఆలయం. ఇది శిథిలమయినప్పటికీ ఇక్కడ నిత్యపూజలు జరుగుతున్నాయి. శివాంకితమైన ఈ ఆలయంలోని స్వామిని విరూపాక్ష అని పిలుస్తారు. 50 మీటర్ల ఎత్తు ఉన్న తూర్పు గాలిగోపురం విరూపాక్ష దేవాలయంలోకి స్వాగతం పలుకుతుంది. ఈ దేవాలయానికి 3 ప్రాకారాలు ఉన్నాయి. 9 ఖానాలతో 50 మీటర్ల ఎత్తు ఉన్న తూర్పు గోపురంలోని రెండు ఖానాలు రాతితోను, మిగతా 7 ఖానాలు ఇటుకలతో నిర్మించారు.

దేవాలయంలో ప్రధాన దైవం విరూపాక్షుడు(శివుడు). ప్రధాన దైవానికి అనుసంధానంగా పంపాదేవి గుడి, భువనేశ్వరి దేవి గుడి ఉంటుంది. విరూపాక్ష-పంపా ఆలయం విజయనగర సామ్రాజ్యం కంటే ముందు నుండి ఉన్నదని శిలాశాసనాలు చెబుతున్నాయి. ఇవి 10-12 శతాబ్దానికి చెందినవి అయి ఉండవచ్చని చరిత్రకారుల అంచనా. చరిత్ర ఆధారాల ప్రకారం ప్రధాన దేవాలయానికి చాళుక్యుల, హోయసల పరిపాలనా కాలంలో మార్పులు చేర్పులు జరిగాయనీ, అయితే ప్రధాన ఆలయం మాత్రం విజయనగర రాజులే నిర్మించారు. ఇలా ఎందరో చక్రవర్తుల పాలనలో విజయనగరం తన ప్రత్యేకతను చాటుకుంది. విజయనగర ప్రభువైన శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.1510లో దీన్ని పునర్నిర్మించాడు. విజయనగర ప్రభువుల కులదైవమైన విరూపాక్ష స్వామి ఆలయ ముఖద్వారం ఎత్తు 50 మీటర్లు. ఆలయంలోపల శిల్పాలతో నిండిన గోడలు కనిపిస్తాయి. పురాతనమైన ఈ ఆలయం ఒక శిల్పసాగరంగా చెప్పవచ్చు. ఈ ఆలయం లోపలి భాగంలో ఒక మండపం, మూడు పూర్వ గదులు, బహిరంగ స్తంభాల హాలు ఉన్నాయి. మూడు టవర్లలో తూర్పు టవర్ 160 అడుగుల ఎత్తులో ఎత్తైనది. విరూపాక్షుడు శివుడిని, విష్ణువును వారి వివిధ అవతారాలలో చిత్రీకరించారు. ఫిబ్రవరి నెలలో ఈ ఆలయ ప్రాంగణంలో రథోత్సవం జరుపుతారు. విరూపాక్ష దేవాలయంలోని బయటి ప్రాకారంలో చెక్కిన భారీ నంది విగ్రహం చాలా దూరం వరకు కనిపిస్తుంది.

విఠల దేవాలయ సముదాయం

హంపికి ఈశాన్య భాగంలో అనెగొంది గ్రామానికి ఎదురుగా ఉన్న విఠల దేవాలయ సముదాయం అప్పటి శిల్పకళా సంపత్తికి ఒక నిదర్శనం. మరాఠాలు పూజించే విష్ణువు అవతారమైన విఠలుని పేరు మీద ఈ ఆలయానికి ఆ పేరు పెట్టారు. ఈ ఆలయం 16వ శతాబ్దానికి చెందినది. విఠల ఆలయం హంపిలోని అత్యంత అద్భుతమైన గొప్ప ఆలయం. ఈ ఆలయ సముదాయంలోకి ప్రవేశించినప్పుడు విజయనగర సామ్రాజ్య కాలం నాటి కళాకారుల ప్రతిభ అడుగడుగునా ఆశ్చర్యపరుస్తుంది. ద్రావిడ, నిర్మాణ శైలితో, విస్తృతమైన శిల్పాలతో ఆలయ సముదాయం అందంగా అలంకరించబడి ఉంటుంది. ఇక్కడ ఉన్న అనేక నిర్మాణాలలో మహా మండపం, దేవి మందిరం, కళ్యాణ మండపం, రంగ మండపం, ఉత్సవ మండపం, రాతి రథం వంటివి ముఖ్యమైనవి. విఠలేశ్వర దేవాలయం ఆకర్షణీయమైన విశేషం ఏమిటంటే సప్తస్వరాలు పలికే ఏడు స్తంభాలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ ఉన్న రంగ మండపం 56 సంగీత స్తంభాలకు ప్రసిద్ధి చెందింది. వీటిని సరిగమ స్తంభాలు అని కూడా అంటారు. ఈ స్తంభాలు సంగీత శబ్దాలను వినిపించడం విశేషం. వీటిపై సున్నితంగా తడితే శ్రావ్యమైన శబ్దాలు వినిపిస్తాయి, మనం స్వయంగా వినవచ్చు. ఈ మండపంలో అనేక ప్రధాన స్తంభాలు, చిన్న స్తంభాల సమితి ఉంటుంది. ప్రతి స్తంభం మండపం పైకప్పుకు అనుసంధానించబడి ఉంటుంది. ప్రధాన స్తంభాలు సంగీత వాయిద్యాల శైలిలో రూపొందించబడ్డాయి. ప్రతి ప్రధాన స్తంభం ఏడు చిన్న స్తంభాలను కలిగి ఉంటాయి. ఇవి వివిధ శబ్దాలలో సంగీత గమనికలను ఉత్పత్తి చేస్తాయి. ఈ స్తంభాలపై గంధపు చెక్కలతో కొడితే సరిగమలకు సరిపోలే విధంగా శబ్దాలు వినిపిస్తాయి. వీటి వెనుక శాస్త్రీయ కారణాలు ఇప్పటికీ తెలియరాలేదు. కానీ సందర్శకులకు మాత్రం ఇవి ఎంతో ఆసక్తికరంగా అనిపిస్తాయి. తుంగభద్రానది దక్షిణ తీరంలో విఠలాలయం నిర్మించారు. శిల్పుల నేర్పరితనానికి ఇది సజీవ సాక్ష్యం. ప్రతి ఏడాది ఇక్కడ పురందరదాసు ఆరాధనోత్సవాలు జరుగుతాయి. సమీపంలో ఉన్న రాతి రథం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఏక శిలలో తొలిచిన విఠల దేవాలయానికి ఎదురుగా రాతితో నిర్మించిన ఏకశిలా రథం ఉన్నది. మన దేశ రూ.50 కరెన్సీ నోటుపై ఈ రాతి రథం బొమ్మను ముద్రించారు. ప్రస్తుతం రథం పైభాగం కొంతమేర శిథిలమైనది. ఈ రాతి రథానికి రాతిచక్రాలు తయారు చేశారు. దీనిపై గరుత్మంతుణ్ణి చెక్కారు. దీనికి వెనుక వున్న ముఖ ద్వారాన్ని సింగరద హెబ్బగిలు అంటారు. ఇది కన్నడ పదం. అందమైన ద్వారం అని దీని అర్థం. ఇక్కడి రెండు దేవాలయాలను పునర్నిర్మించడంతో దీనికి అందమైన ద్వారమనే సార్థక నామమేర్పడింది.

ఉగ్రనరసింహుడి విగ్రహం

హంపిలోని లక్ష్మీనరసింహ ఆలయం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. సమీపంలో ఉన్న ఉగ్రనరసింహుడి విగ్రహం గంభీరంగా కనిపిస్తుంది. 8,9 మీటర్ల అతిపెద్ద నరసింహస్వామి విగ్రహమిది. ఇక్కడే గణేశుని విగ్రహంతో పాటు శివలింగం చూడవచ్చు. మహావిష్ణువు అవతారమైన నరసింహస్వామికి పరమాద్భుతంగా ఏకశిలలో మలిచారు. హేమకూట పర్వతపు హాలులో రెండు గణేశ విగ్రహాలున్నాయి. ఆలయంలో ఒక గణేశుడు, కొద్ది దూరంలో ఆరుబయట మరో గణేశుడు, కొద్ది దూరంలో ఆరుబయట మరో గణేశుని విగ్రహాలున్నాయి. నరసింహ స్వామి పక్కనే నీటిలో శివలింగం ఉంది.

హజార రామాలయం

ఆంధ్రభోజుడిగా కీర్తి గడించిన శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన హజార రామాలయం ఇక్కడ కనిపిస్తుంది. ఈ ఆలయ సముదాయం రాయల్ సెంటర్ మధ్యలో ఉంది. దీనిని ఒకప్పుడు రాజ కుటుంబ సభ్యులు ప్రార్థనా స్థలంగా ఉపయోగించారు.

15వ శతాబ్దంలో నిర్మితమైన ఈ దేవళం చిన్నదే అయినా చూడచక్కగా ఉంటుంది. ఆలయ కుడ్యాలపై ఏనుగులు, ఒంటెలు, గుర్రాల ప్రతిమలు చెక్కారు. ఇంకా రామాయణ, భారత దృశ్యాలు నయనానందం చేస్తాయి. పురాణ సంబంధమైన గాథలకు శిల్పరూపం ఇక్కడ దర్శనమిస్తుంది. ఈ ఆలయంలోని శిల్పాలు అనేక ధాతువులతో నిర్మించారు. అయితే ప్రస్తుతం హజార రామాలయం శిథిలావస్థలో ఉన్నది.

గజశాల

ఏనుగుల కోసం ఇక్కడ ఒక గజశాల నిర్మించారు. పట్టపు ఏనుగుల నివాసం, వాటి దైనందిన కార్యకలాపాల కోసం రాజప్రాసాదానికి సమీపంలోనే గజశాల ఉంది. ఏనుగులు కవాతు చేయడానికి వీలుగా ఈ గజశాలకు ఎదురుగా ఖాళీ ప్రదేశం ఉంది. ఈ గజశాల గుమ్మటాలలో ఇస్లామిక్ శిల్పశైలి కనిపిస్తుంది. మావటి వారితో పాటు సైనికులు ఉండడానికి గజశాలకు పక్కన సైనిక స్థావరాలు ఉన్నాయి.

ఎటువంటి మత సంబంధంలేని అతి సుందర నిర్మాణం లోటస్ మహల్. దీన్ని ఇస్లామిక్, హిందూ శిల్పకళల సంగమంతో పరమాద్భుతంగా కట్టారు. విశాలమైన మైదానంలో లోటస్ మహల్‌ను నిర్మించారు. భవనం పైభాగంలో కిటికీలు, బాల్కనీ ఉన్నాయి. దీనిపై నిర్మితమైన ఆర్చీలు సుందరంగా కనిపిస్తాయి. తుంగభద్రా నదీ తీరాన నిర్మితమైన మంటపం అందంగా తీర్చిదిద్దారు. అక్కడ నుండి కనిపించే కొండలు, రమణీయ ప్రకృతి నేత్రానందం కలిగిస్తాయి. హంపిలో రాజభవనాలు కొన్ని శిథిలావస్థలో కనిపిస్తాయి. చాలా నిర్మాణాలు శిథిలమైనప్పటికీ ఆ శిల్పకళ అబ్బురపరుస్తుంది. కమలాపురం నుండి అర కిలోమీటరు దూరంలో రాణివాసపు స్త్రీల కోసం స్నానమందిరాలు నిర్మించారు. స్నానశాల 1.8 మీటర్ల లోతు, 15 మీటర్ల చుట్టుకొలతతో నిర్మించారు. ఇంకా రాజభవనాలు, జైన ఆలయ సముదాయం, మాతంగ పర్వతం, కోదండ రామాలయం, అనేక మెట్లతో నిర్మించిన అతిపెద్ద బావి, భూగర్భ భవనాలు, నృత్యం కోసం నిర్మితమైన గంభీర మంటపాలు, పంపా సరోవరం, టంకశాల, భూగర్భ ఆలయాలు ఇత్యాదివి ఎన్నో ఉన్నాయి. హంపిలో జరిగిన తవ్వకాల్లో ఎందరో రాజప్రముఖుల మందిరాలు బయటపడ్డాయి. వీటిలో మంత్రులు, సైనికులు, పరిపాలనాధికారుల భవనాలను

గుర్తించారు. విజయనగర ప్రభువుల వైభవానికి సజీవసాక్ష్యంగా నేటికీ హంపి నిలిచి ఉన్నది. హేమకుట కొండల వద్ద సూర్యాస్తమయం నయనానందం చేస్తుంది. ఇలా అనేక ప్రదేశాలు హంపిలో చూడదగినవి అనేకం ఉన్నాయి.

కమలాపురం వద్ద పురావస్తు మ్యూజియం, అచ్యుతరాయ ఆలయం పేరుతో పిలిచే తిరువెంగళనాథ ఆలయం, యంత్రోధారక ఆంజనేయ, చంద్రమౌళేశ్వర్, భూగర్భ, ఉద్దాన వీరభద్ర ఇత్యాది ఆలయాలు తుంగ భద్ర నది, బడవ లింగా, అంజనాద్రి కొండ, మాధవన్ ప్యాలెస్, యేదురు బసవన్న, విరుణపుర మొదలైవన్నీ దర్శించదగిన ప్రదేశాలు. ప్రాచీన భారతదేశ వాస్తుకళకు సంబంధించిన దాదాపు ప్రతి వైభవం ఇక్కడి 14వ శతాబ్దం నాటి శిథిలాల్లో భద్రంగా దాగి ఉంది. ఇంతటి ఘన చరిత్రను కలిగిన హంపిని యునెస్కోవారు ప్రపంచ చారిత్రక స్థలంగా ప్రకటించారు. హంపి నగరం విజయనగర సామ్రాజ్యానికి చివరి రాజధాని అని చరిత్రలో పేర్కొన్నారు. 14 నుండి 16వ శతాబ్దాల మధ్య ఇక్కడ పర్యటించిన అనేకమంది యాత్రికులు ఈ ప్రదేశం గురించి గొప్పగా ప్రస్తుతించారు. ఈ ప్రాంతంలోని కోటలు, దేవాలయాలు, విపణీ ప్రాంతాలు, నిఘా స్థూపాలు, గుర్రపుశాలలు, స్నానఘట్టాలు, ఏకశిలా విగ్రహాలు లాంటి అపురూప నిర్మాణాలన్నీ ఇప్పుడు కాలగిన శిథిలాల రూపంలో పెద్ద బండరాళ్ల కింద నిక్షిప్తమైపోయాయి. ఇటువంటి దృశ్యాలు చూసినప్పుడు శిల్పకళా ప్రియులు కంటతడి పెట్టకమానరు. ఈ సామ్రాజ్యం పతనావస్థకు చేరడానికి పూర్వం అనేక సంవత్సరాల పాటు ఇక్కడ వర్ధిల్లిన శిల్పకళ, వాస్తుకళ, చిత్రకళలకు ఈ ప్రాంతం వారసత్వంగా నిలుస్తోంది. శిథిలమైనవి కాగా మిగిలివున్న కళాఖండాలు ఇప్పుడు ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధుల్ని చేస్తూ దేశ, విదేశీ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

మేషం

ఆర్థిక ఇబ్బందులుంటాయి. రుణాలు చేయాల్సి వస్తుంది. వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి. ఉద్యోగులకు పై అధికారులను సందర్శిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. స్త్రీలకు సమస్యలుంటాయి. గృహ యోగం. సన్మాన సూచనలున్నాయి. వాహన యోగం. సంతానాభివృద్ధి బాగుంటుంది.

వృషభం

వృత్తి రంగాల్లో వున్నవారికి ఖర్చులుంటాయి. విద్యార్థులకు విజయం లభిస్తుంది. సంతానాభివృద్ధి సంతోషం కలిగిస్తుంది. సాహిత్య సభల్లో పాల్గొంటారు. రుణాలు తీరుస్తారు. దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుంది. ఉత్సాహంగా గడుస్తుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. శుభ కార్యాలను అనుకూలమైన సమయం. రుణాలు తీరుస్తారు.

మిథునం

విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థికంగా బాగుంటుంది, అదే స్థాయిలో ఖర్చులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. పై అధికారులతో మాట్లాడేటప్పుడు సహనంతో ఉండండి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. వ్యవసాయదారులకు చిన్న చిన్న సమస్యలు ఎదురవుతాయి.

కర్కాటం

బంధు, మిత్రులను కలుసుకుంటారు. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. ఆందోళనకు లోనవుతారు. విద్యాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. వృత్తి రంగాల్లో వున్న వారికి సామాన్య విజయం. ఆరోగ్య సమస్యలుంటాయి. వృధా కాలక్షేపం చేస్తారు. దూర దేశ ప్రయాణం చేసే సూచనలు ఉన్నాయి. ఉద్యోగులకు, వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది.

సింహం

మానసిక భయం వెంటాడుతుంది. గృహ సౌఖ్యం. ప్రయాణం లాభిస్తుంది. ధార్మిక చింతన అలవడుతుంది. ఉద్యోగాభివృద్ధి బాగుంటుంది. గృహ, భూ వసతులు ఏర్పాటు చేసుకుంటారు. వృత్తి రంగాల్లో వున్నవారికి లాభాలు ఉంటాయి. వ్యాపారుల మధ్య పోటీ ఏర్పడుతుంది. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ప్రయత్నం ఫలిస్తుంది.

కన్య

గృహ యోగం. సామాన్య ధన లాభాలుంటాయి. వాహన ప్రాప్తి. వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. శ్రమ అధికంగా ఉంటుంది. కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి. పాప కార్య చింతన, దుష్ట సాంగత్యం మంచిది కాదని తెలుసుకుంటారు. మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది.

తుల

ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. సామాన్య ధన లాభాలుంటాయి. వృథా ఖర్చులుంటాయి. కొన్ని విషయాల్లో ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. క్రయ-విక్రయాలు బాగుంటాయి. బంధు, మిత్రులతో మాట్లాడేటప్పుడు ఆచి తూచి వ్యవహరించడం మంచిది. ధర్మ రక్షణకై పాటుపడతారు. ఆలోచనల్లో చంచలత్వం ఏర్పడుతుంది. జాయింటు సమస్యలు పరిష్కరించుకుంటారు.

వృశ్చికం

భోజన సౌఖ్యం. ఆరోగ్య సమస్యలుంటాయి, జాగ్రత్తలు పాటించడం మంచిది. వృత్తి ఉద్యోగాల్లో ఉన్నవారికి ప్రతికూలతలు ఉంటాయి. కుటుంబ సభ్యుల మధ్య ఐక్యమత్యం ఏర్పడుతుంది. అకారణంగా మనోవేదనకు లోనవుతారు. శుభ కార్య ఆలోచనలు ఫలిస్తాయి. క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. బంధు, మిత్రులతో కలిసి ఉత్సాహంగా గడుపుతారు. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ధనుస్సు

స్త్రీల వల్ల సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. చోర భయం పొంచి వుంది కనుక అప్రమత్తంగా ఉండండి. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలుంటాయి. వ్యాపారులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. అన్ని వ్యవహారాల్లో మీరే విజయం సాధిస్తారు. అనుకోని సంఘటనలు జరుగుతాయి. వృథా కాలక్షేపం చేస్తారు. మానసిక వేదనకు లోనవుతారు. ముఖ్య సమాచారం తెలుస్తుంది.

మకరం

పాప కార్య చింతన మంచిది కాదని తెలుసుకుంటారు. జాయింటు వ్యవహారాల్లో మనస్పర్థలు ఏర్పడతాయి. వ్యాపారులకు లాభ, నష్టాలుంటాయి. వివాహాది శుభ కార్యాలకు హాజరవుతారు. దుర్వ్యసనాలకు ధనం ఖర్చు చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతి లభించే సూచనలు అధికంగా ఉన్నాయి. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు.

కుంభం

ప్రశాంతత ఏర్పడుతుంది. సంతాన ప్రాప్తి సంతోషం కలిస్తుంది. ఆకస్మిక ధన లాభం. వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. ధార్మిక చింతన అలవడుతుంది. వారాంతంలో క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. రుణాలు చేయాల్సి వస్తుంది. ఆకస్మిక కోర్టు వ్యవహారాలు అసహనం కలిగిస్తాయి. శారీరక, మానసిక ఒత్తిడి ఉంటుంది.

మీనం

అనుకున్న పనులు పూర్తవుతాయి. ఉద్యోగం లభిస్తుంది. గృహ సౌఖ్యం. ప్రయాణం లాభిస్తుంది. కొత్త రుణాలు చేసి పాత రుణాలు తీరుస్తారు. ఆరోగ్య సమస్యలుంటాయి కనుక జాగ్రత్తలు పాటించడం మంచిది. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. విద్యా, వివాహ సమస్యలు పరిష్కారమవుతాయి. వాహన యోగం. వృత్తి వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది.

హెడ్‌ఫోన్ వల్ల వినికిడి లోపం..

'పుస్తకం వాస్తభూషణం' అనేది పాత నానుడి. దాని స్థానంలో ఇప్పుడు హెడ్ ఫోన్స్ వచ్చి చేరాయి. హెడ్‌ఫోన్స్ లేని వ్యక్తులు కనిపించడం అరుదు. 'కాదేది కవితకనర్హం' అన్నట్లు ఎక్కడైనా యువత హెడ్‌ఫోన్స్‌తో దర్శనమిస్తోంది. కానీ ఎప్పుడూ హెడ్‌ఫోన్స్ ఉపయోగించడం వల్ల వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు అంటున్నారు. కోట్ల మందికి వినికిడి లోపం కరోనా తర్వాత వర్క్ ఫ్రమ్ హోమ్ నేపథ్యంలో ఆఫీసు వర్క్ చేయలన్నా, ఆన్‌లైన్ క్లాసులు చెప్పాలనా, వినాలన్నా హెడ్‌ఫోన్స్ వాడకం తప్పనిసరైపోయింది. ఇప్పటికి ప్రపంచ వ్యాప్తంగా నలభై మూడు కోట్ల మంది వినికిడి లోపంతో బాధపడుతున్నట్లు డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. ఇది ఇలాగే కొనసాగితే రాన్ను రోజుల్లో యువతలో వినికిడి సమస్య పెరిగే అవకాశం ఉందని పరిశోధకులు అంటున్నారు.

ఇన్ఫెక్షన్స్‌తో ఇబ్బంది: ఇయర్ ఫోన్స్, హెడ్‌ఫోన్స్, ఇయర్‌బడ్స్.. ఇలా పేరేదైనా వీటిని కర్ణభేరికి అత్యంత దగ్గరగా పెట్టుకోవడం వల్ల బ్యాక్టీరియా, ఫంగస్ చెవులలో పేరుకుపోయి దురద, నొప్పి, చెవిలో చీము కారడం వంటి ఇన్ఫెక్షన్స్ ఎదురవుతాయి.

2050 నాటికి..

ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో ప్రపంచ వ్యాప్తంగా వంద కోట్లకు పైగా యువత వినికిడి శక్తిని కోల్పోయే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిస్తోంది. 2050 నాటికి ప్రతీ నలుగురిలో ఒకరు వినికిడి లోపంతో బాధపడే అవకాశం ఉందని తెలిపింది.

అలర్ట్ కోసం..

హెడ్‌ఫోన్స్‌లో ఒకవేళ పరిమితికి మించి ఎక్కువ సౌండ్‌తో వింటే అలర్ట్ చేసేందుకు స్మార్ట్ ఫోన్‌లో సెట్టింగ్స్ మార్చుకోవాలి. లేదా కొన్ని యాప్స్‌ను ఉపయోగించుకోవచ్చు.

పరిమితి మించితే?

పెద్దవాళ్లు 80 డెసిబెల్స్, పిల్లలు 75 డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్దంతో హెడ్‌ఫోన్స్ ఉపయోగించడం వల్ల అది వినికిడి శక్తి మీద ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ఫంక్షన్లలో ఎక్కువ ధ్వనిని వెలువరించే స్పీకర్స్‌కు దూరంగా కూర్చోవడం మంచిది. అధిక ధ్వనిని వెలువరించే పబ్‌లు, పార్టీలకు వెళ్లక పోవడం మరీ మంచిది.

వాయిస్ క్యాన్సెలింగ్

సాధారణంగా చాలామంది బయటి శబ్దాలు వినిపించకుండా ఉండడానికి హెడ్‌ఫోన్స్ వాల్యూమ్‌ను పెంచుతారు. దీనివల్ల కర్ణభేరి దెబ్బతింటుంది. అందుకే వాయిస్ క్యాన్సెలింగ్ హెడ్ ఫోన్స్‌ని వాడడం మంచిది. ఇది తక్కువ వాల్యూమ్‌తో మంచి అనుభవాన్నిస్తుంది.

బ్రేక్...క్...క్: నిరంతరాయంగా హెడ్ ఫోన్స్ వాడడం మంచి కాదని వైద్య నిపుణులు అంటున్నారు. మధ్య మధ్యలో కాస్తంత బ్రేక్ తీసుకోవడం వల్ల మంచిదంటున్నారు. ప్రతీ గంటకు కనీసం 10 లేదా 15 నిమిషాల బ్రేక్ తీసుకోవడం వల్ల ఈ సమస్యను కొంతవరకు తగ్గించవచ్చని అంటున్నారు.



అప్పటికే రమణి వంట గదిలో తిష్ట వేసి గంటకు పైగా కావస్తుంది. తన మనస్సులోని అభద్రతా భావం బయట పెట్టేందుకు కూతురు వంటగది మాత్రమే అనువైనది అనుకున్నదేమో.. వంటగది వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేసినట్లుగానే ఉంది రమణి వాలకం.

“వినేందుకు ఇంకేముంది.. నా పని నేను చేసుకోవడం ఉత్తమం” అనుకుందేమో, వంటపైన దృష్టి సారించింది మానస.
“పదేపదే చెపుతున్నా అనుకోవద్దు”
“నువ్వు ఎంత జాగ్రత్తలో ఉంటే అంత మంచిది”
“నా మట్టుకు నేను లొడలొడా వాగడమే

రాము కోలా

చెడును త్యజించాలి. దాని వలన కలిగే నష్టాన్ని గుర్తెరిగి జాగ్రత్తగా మసలుకోవాలి”
“నేడు ఆడపడుచు అంటే చెల్లిగానో, బిడ్డగానో వదినకు తోడుగా నిలిచే మరో అమ్మలా నిలిచే తోడనుకోవాలి. లేదా అలా ఉండేలా మార్చుకోవాలి”.
ఆడబిడ్డ అంటే? ఇంటి కోడలిపైన పెత్తనం చెలాయించే మరో అత్తరూపమనే అభిప్రాయం మనసులోంచి తొలగిస్తే మెట్టినింటికి అడుగిడిన కొత్త కోడలికి మంచి స్నేహితురాలు దొరికినట్లే.
ఇదే నేడు ప్రతి ఆడపిల్ల తల్లి తెలుసుకోవాల్సిన విషయాలు.
“నా ఆడబిడ్డ బంగారం”
నా పనిలో ఎంతో సహకరిస్తుంది.
మా వారిని ఒప్పించి తనతో సమానంగా డిగ్రీ పరీక్షలకు ఫీజు కట్టించింది, సాయంత్రంపూట నాకు కామర్స్ కూడా చెపుతుంది. అంత మంచిది నీలాగే..”
పాత కాలంలో నేడు ఆడబిడ్డ ఇంటికోడలి కాళ్లకు వేసే సంకెళ్లు వంటిది కాదు, ఇంటి కోడలికి మంచి

దృక్పథం

కానీ... నీ నుండి స్పందనే రాదేం?”
రమణి కూతురు వైపుకు గుర్రుగా చూస్తూ కాస్త గద్దిస్తున్నట్లుగా అనడంతో–
“స్టౌ మీది పాలగిన్నె దించి పక్కన పెడుతూ “అలాగే గుర్తుంచుకుంటాను”
“అయినా నువ్వు ఊహించుకునేదానికి ఇక్కడ జరిగేదానికీ ఏమాత్రం పొంతన లేదమ్మా. ఏమైనా ఉంటే నీకు చెప్పకుండా దాస్తానంటావా?”
“అనవసరంగా ఏదేదో ఊహించుకుని నువ్వు భయపడి నాన్నగారిని భయపెట్టకు, ఏదైనా ఇబ్బందిగా అనిపిస్తే తప్పకుండా మీకు ఫోన్ చేసి చెపుతాను.. సరేనా?”
“నువ్వు మనసులో ఏదీ పెట్టుకోకుండా ఉంటే మంచిది. నేను బాగానే ఉన్నానని నాన్నగారికి చెప్పు” తల వంచుకుని పని చేసుకుంటూ తల్లికి వినిపించీ వినపడనట్లుగా అనేసి తన పని తాను చేసుకుపోతోంది మానస.
“పాలేవో, నీళ్లేవో తెలుసుకోలేని పిచ్చిదానివి”
“అప్పుడే నిన్ను తన బుట్టలో వేసుకొనే వేసుకుందా?”
“ఇక నా మాటలు నీకు రుచించవులే” చెంగుతో ముక్కు తూడ్చుకుంది రమణి.
“ఆడబిడ్డ అంటే అర్థమొగుడు అంటారు. ఎలా నెట్టుకొస్తావో ఏమిటో? నువ్వా నోట్లో నాలుక లేని పిల్లవి. జాగ్రత్త!” చెప్పి చీరకొంగుతో కన్నుల్లో నీళ్లు ఒత్తుకుంది మానస తల్లిగారు రమణి.
“ఏదైనా మనం చూసే విధానంలోనే ఉంటుందమ్మా!”
“ఆడబిడ్డ అంటే అర్థభాగం అనేది మంచికోసం చెప్పిన మాటే అని ఎందుకు అనుకోరు?”
“భర్త దగ్గర లేని సమయంలో వదిన ఆలనా పాలనా తానే చూసుకుంటుంది కనుక అలా అని ఉంటారు పాత కాలంలో”
“ఏదైనా సూక్తిలో మంచిని మాత్రమే మనం తీసుకోవాలి.

స్నేహితురాలు కూడా!”
“అమ్మా! ఇక నువ్వు నిశ్చింతగా ఉండవచ్చు, సరేనా?” అని చెప్తున్న కూతురు వైపు చిరునవ్వుతో చూసి రమణి.
తన బిడ్డకు ఆడబిడ్డల పోరు లేదని, అత్తవారింట తనకు మంచి ఆదరణ లభిస్తోందని తెలిసి గుండెల నిండుగా గాలి పీల్చుకుంది రమణి.
ప్రతి తల్లీ తన బిడ్డ క్షేమం కోరుకుంటుంది.
రమణి కూడా అంతే. ❑


'కుక్కకు ముక్క' స్కీం కాంట్రాక్టు నాకిప్పిస్తే.. కుక్కలన్నిటినీ
నా సొంత ఖర్చుల్తో చూసుకుంటా..!!
కుక్కల సెక్షన్
— మునిసిపాలిటీ ఆఫీసు —
Zakir...


ముష్టి మూగొండల ముందుతే రొస్తారా..?
ముంగుట కూగా కానుక్కోలేని దానిలా కనిపిస్తున్నానా...?!
Zakir...

దీన్నిండా మస్త్ డబ్బులున్నయి సాబ్... ఇండియా
మీద అటాక్ కంటిన్యూ చేద్దాం...!!
Zakir...

ఈ వారం కార్టూన్స్

టాన్స్‌ఫగరేసన్ హైవే రొమేనియాలో పర్యాటక ప్రాంతంగా పేరు గాంచింది. ఈ రోడ్డు జూన్ నుంచి అక్టోబరు వరకు మాత్రమే తెరుస్తారు. ఈ దారి ఆల్ప్స్ పర్వతాల్లోని గ్రేట్ వాల్లాచియాను, ట్రాన్స్‌సిల్వేనియాతో కలుపుతుంది. ఎత్తు నుండి చూస్తుంటే ఎన్నో వంపులు తిరిగి వయ్యారంగా పాకుతున్నట్టు కనిపిస్తుంది.

ప్రతి సంవత్సరం ఇక్కడ సిబూ సైక్లింగ్ టూర్ మౌంటెయిన్ రేసు నిర్వహిస్తుంటారు.